http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 16 డిసెంబర్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

**విలేకరులు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## ప్రధాన పార్టీలకు స్వతంత్రుల ఝలక్

- పంచాయతీ పోరులో ఓటర్ల భిన్నమైన తీర్పు
- రాష్ట్రంలో ముగిసిన రెండో విడత పంచాయతీ ఎన్నికలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భిన్నమైన తీర్పునిచ్చిన ఓటర్లు
- 199 చోట్ల కాంగ్రెస్ మద్దతు దారులు, 117 చోట్ల బీజేపీ మద్దతు దారులు విజయం
- ఇక బీఆర్ఎస్ 99 స్థానాలతో మూడో స్థానానికి పరిమితమైంది.
- ఇండిపెండెంట్ అభ్యర్థులు 82 చోట్ల గెలుపొందటం రాజకీయ వైవిధ్యాన్ని చాటింది




హైదరాబాద్

రాష్ట్రంలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు ఆదివారంతో ముగిశాయి. ఎన్నికల ఫలితాలను కూడా అదేరోజు ప్రకటించారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు మొదటి విడతతో పోల్చుకుంటే భిన్నమైన తీర్పు ఇచ్చినట్లుగా స్పష్టమవుతోంది. ఈసారి కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌లనూ ఆదరించినట్లుగా స్పష్టమైంది. నియోజకవర్గాల వారీగా నేతలు ప్రభావం చూపినట్టు వెల్లడైంది. రెండో దశలో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, సిర్పూర్(టి), బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని 28 మండలాల్లో 514 గ్రామ పంచాయతీలకు గానూ, 30 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఓచోట ఎన్నిక జరగలేదు. మిగిలిన 483 పంచాయతీల్లో 1,635 మంది సర్పంచి అభ్యర్థులు - మిగతా3లో



## లోక్‌సభలో వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు

- వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును జేపీసీ పంపే అవకాశం
- ఒకే గొడుగు కింద వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే కొత్త కమిషన్‌ను ఏర్పాటు
- 12 మంది సభ్యులతో కూడిన వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే అత్యున్నత కమిషన్ ఏర్పాటు
- ఒకే కమిషన్ ద్వారా విద్యా ప్రమాణాలు కఠినంగా అమలు చేయవచ్చు

## 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలి

- బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- కోర్టు గడువు వల్ల పంచాయతీ ఎన్నికలకు వెళ్లాం
- బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం పోరాడుతున్నాం
- శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేసింది
- సామాజిక రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం పరిమితి ఎత్తివేయాలని డిమాండ్ చేసింది.
- టీపీసీ చీఫ్ మహేష్ గౌడ్

ఢిల్లీ

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని బీసీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీపీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. 'బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. కోర్టు గడువు వల్ల పంచాయతీ ఎన్నికలకు వెళ్లాం. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం పోరాడుతున్నాం' అని తెలిపారు. ఈ మేరకు సోమవారం(డిసెంబర్ 15వ తేదీ) ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ - మిగతా3లో






## భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో సర్వీసు ఫీజు పెంపు

- జనవరి 1 నుంచి కొన్ని కేంద్రాల్లో అమల్లోకి పెంపు నిర్ణయం
- నిర్వహణపరమైన వ్యయాలు, ద్రవ్యోల్బణం కారణంగా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- వెల్లడించిన న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్

## చైనా పార్టులు వద్దు..



- రూ.5,000 కోట్లతో స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం
- భారీగా దేశీయ డ్రోన్లను సమకూర్చుకోనున్న సైన్యం
- కామికేజ్, నిఘా, సుదూర లక్ష్య ఛేదన డ్రోన్ల సమీకరణ
- జామింగ్, స్పూఫింగ్‌ను తట్టుకునేలా ప్రత్యేక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యం

## ఇక కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

- ఈ ఎన్నికల ఫలితాలు రేవంత్‌కు చెంపపెట్టు
- కేటీఆర్ సంచలన ట్వీట్
- పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం
- కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు.. రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయింది
- 'రెండో దశ పంచాయతీ ఎన్నికల్లోనూ అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు



హైదరాబాద్

తెలంగాణ రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఇక కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని తమ ఓటు ద్వారా పల్లె ప్రజలు చెప్పారని అన్నారు. తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రంచేస్తున్న రేవంత్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని - మిగతా3లో



## ఢిల్లీలో వాయు కాలుష్యం.. పౌరులకు అడ్వైజరీ జారీ చేసిన సింగపూర్ హైకమిషనర్..!

- జనం తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు
- ఇంట్లోనే ఉండాలని.. బయటకు వచ్చిన సమయంలో మాస్కులు ధరించాలి
- రాజధాని ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ లెవల్-4 అమలు

## ఐసిస్‌తో సంబంధాలు.. ఉగ్రవాదుల అరెస్ట్

- ఐసిస్ ఉగ్రసంస్థ ఆదేశాల మేరకు భారత్‌లో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం
- దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీగా సోదాలు
- గత నెలలో ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో (నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ) అప్రమత్తం



## కేసీఆర్ ఆగయా!

- రంగంలోకి గులాబీ బాస్..
- గేరు మార్చనున్న కారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని కేసీఆర్ భావిస్తున్నారు
- ఈ నెల 19న కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ ఎల్పీ భేటీ
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సంయుక్త సమావేశం జరగనుంది
- నీటిపారుదల ప్రాజెక్టులను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా చేస్తోందని బీఆర్ఎస్ మండిపడుతోంది.



హైదరాబాద్

ప్రజా ఉద్యమానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతుంది. ప్రత్యక్షంగా గులాబీ బాస్ కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ నెల 19న కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ ఎల్పీ భేటీ కానుంది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సంయుక్త సమావేశం జరగనుంది. నీటిపారుదల ప్రాజెక్టులను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా చేస్తోందని బీఆర్ఎస్ మండిపడుతోంది. తెలంగాణకు సాగునీటి విషయంలో బీజేపీ కూడా అన్యాయం చేస్తుందని బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. ఏపీ ప్రభుత్వం జలదోపిడీకి బీజేపీ సహకరిస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఎదుర్కొంటామని బీజేపీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని కేసీఆర్ భావిస్తున్నారు. బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఈ నెల 19న మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ భేటీలో బీఆర్ఎస్ శాసనసభా పక్షంతోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గం పాల్గొంటుంది. తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు నిర్మించే ప్రజా ఉద్యమంపై విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చించాలని పార్టీ నిర్ణయించింది. నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మౌనం వహించకుండా ప్రత్యక్ష పోరాటానికి దిగాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యమ నిర్మాణానికి అనుసరించాల్సిన కార్యాచరణపై సమావేశంలో కీలక నిర్ణయాలు ఉంటాయని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

# ఢిల్లీలో వాయు కాలుష్యం..
# పౌరులకు అడ్వైజరీ జారీ చేసిన సింగపూర్ హైకమిషనర్!

దేశ రాజధాని ఢిల్లీ నగరంలో వాతావరణ కాలుష్యం కొనసాగుతున్నది. దాంతో జనం తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో సింగపూర్ హైకమిషన్ ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లోని పౌరులకు అడ్వైజరీ జారీ చేసింది. ఇంట్లోనే ఉండాలని.. బయటకు వచ్చిన సమయంలో మాస్క్‌లు ధరించాలని సూచించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు 'సమీర్' యాప్ ప్రకారం.. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మధ్యాహ్నం 2 గంటల సమయంలో 437గా నమోదైంది. ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో ఏక్యూఐ 400 అంతకంటే ఎక్కువగానే ఏక్యూఐ నమోదైంది. సింగపూర్ హైకమిషన్ సోషల్ మీడియా వేదికగా అడ్వైజరీ జారీ చేశారు. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ లెవల్-4 అమలవుతోందని పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, శ్వాసకోశ, గుండె జబ్బులు ఉన్న వారు ఇంట్లోనే ఉండాలని.. బయటకు వెళ్లిన సందర్భంలో మాస్క్‌లు ధరించాలని హైకమిషన్ సూచించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నివసించే సింగపూర్ పౌరులు సలహాలు పాటించాలని సింగపూర్ హైకమిషన్ కోరింది. తక్కువ దృశ్యమానత కారణంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు, అక్కడి నుంచి వచ్చే విమానాలు ప్రభావితమవుతాయని అడ్వైజరీలో తెలిపింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, అనేక విమానయాన సంస్థలు సైతం హెచ్చరికలు జారీ చేశాయి. ప్రయాణీకులు అప్‌డేట్స్‌ను



విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నివసిస్తున్న సింగపూర్ పౌరులకు సహాయం అవసరమైతే వారి ఫోన్ నంబర్లలో సంప్రదించాలని నెంబర్లను విడుదల చేసింది. ఇదిలా ఉండగా.. ఢిల్లీలో వరుసగా మూడోరోజు వాయు కాలుష్యం తీవ్రంగా కొనసాగుతున్నది. దాంతో దేశీయ, అంతర్జాతీయ విమానాలు సైతం ప్రభావితం చేసింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 400కిపైగా విమానాలు ఆలస్యం అయ్యాయి. 61 విమానాలు రద్దు కాగా.. ఐదు విమానాలను దారి మళ్లించారు.

# చైనా పార్టులు వద్దు..

భారత సైన్యం తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో, సుమారు రూ.5,000 కోట్ల విలువైన పూర్తి దేశీయ డ్రోన్ల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. శత్రు దేశాల నుంచి ఎదురయ్యే జామింగ్, స్పూఫింగ్ వంటి ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఈ డ్రోన్లను ప్రత్యేకంగా రూపొందించారు. గతంలో పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థలపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సైన్యం ఈ డ్రోన్ల కోసం కఠినమైన పరీక్షలు నిర్వహించింది. అత్యవసర కొనుగోలు నిబంధనల కింద ఈ ప్రక్రియను చేపడుతుండగా, కేవలం దేశీయ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు మాత్రమే అవకాశం కల్పించారు. ముఖ్యంగా, ఈ డ్రోన్లలో చైనాకు చెందిన విడిభాగాలు ఏమాత్రం ఉండకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. ది ఎకనామిక్ టైమ్స్ కథనం ప్రకారం, సైన్యం మూడు రకాల అవసరాల కోసం ఈ డ్రోన్లను సమకూర్చుకోనుంది. వీటిలో తక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించే కామికేజ్ లేదా లోయిటరింగ్ డ్రోన్లు, సుదూర లక్ష్యాలను గుర్తించి ధ్వంసం చేసి తిరిగి వెనక్కి రాగల ప్రెసిషన్ డ్రోన్లు, నిఘా కోసం ఉపయోగించే యూఏవీలు ఉన్నాయి. ఈ డ్రోన్ల ఎంపిక కోసం భారత సైన్యం ప్రత్యేకంగా ఒక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ టెస్టింగ్ జోన్‌ను ఏర్పాటు చేసింది. ప్రయోగం మొదలైనప్పటి నుంచే తీవ్రమైన జామింగ్ పరిస్థితులను సృష్టించి వాటి పనితీరును పరీక్షించింది.



అలాగే, ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో కూడా ఇవి ఎంత సమర్థవంతంగా పనిచేస్తాయో పరిశీలించింది. ఈ పరీక్షల్లో ప్రభుత్వ రంగ సంస్థ అయిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, సుమారు రూ.500 కోట్ల విలువైన లోయిటరింగ్ మ్యూనిషన్స్ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ భారీ కొనుగోలుతో భవిష్యత్ యుద్ధాల్లో భారత సైన్యం నిఘా, దాడి సామర్థ్యాలు గణనీయంగా పెరగనున్నాయి.

# ఇంక్రిమెంటేగా...ఇచ్చేస్తే పోలా...

వడ్డించేటోళ్ళు మనోళ్ళయితే ఆ కిక్కే వేరప్పా...డిపార్ట్ మెంట్ ఏదైనా...ఫికరే లేదు. మన బాస్ కు మనం కాకా కొడితే చాలు. బాస్ ఈజ్ ఆల్వేజ్ రైట్ అనే సూత్రాన్ని గట్టిగా పాటిస్తే...జీతం అదంతటదే పెరుగుతుంది. తెలివితేటలు, శ్రద్ధ, నిబద్ధత...ఇవన్నీ తుప్పాస్... పెద్ద సార్ ను జాగ్రత్తగా చూసుకుని వారి కనుసన్నల్లో పడుంటే చాలు. అందుకే అక్కడి ఉద్యోగుల్లో కొందరికి ఎడాపెడా ఇంక్రిమెంట్లు వచ్చి పడుతున్నాయి. కారణం బాస్ భజనే. ఇదెక్కడో కాదండోయ్ సాక్షాత్తు న్యాయవ్యవస్థలోనే. అందరికీ శకునాలు చెప్పే బల్లి తానే కుడితిలో పడ్డట్టు...ఊరందరికీ న్యాయం చేసే పెద్దమనుషులు తమ కింది ఉద్యోగులకు మాత్రం తమను తోచినట్టుగా....తమకు నచ్చినట్టుగా ఇంక్రిమెంట్లు ఇస్తుండటంతో అందరూ ముక్కున వేలేసేకుని...ఔరా ఇలా కూడా చేస్తున్నారా అనుకుంటూ సన్నాయినొక్కుల నొక్కుతున్నారు. సాదారణంగా ఓ కంపెనీలో... ప్రైవేటయినా... ప్రభుత్వం అయినా...పనిచేసే ఉద్యోగికి ప్రమోషన్ రావాలన్నా... కనీసం ఇంక్రిమెంట్ పడాలన్నా...సదరు ఉద్యోగి తలప్రాణం తోకకొస్తుంటుంది. ఎంత పనిచేసినా...ఎంత కష్టపడినా...బాస్ గుడ్ లుక్స్ లో లేకుంటే ఆ ఉద్యోగికి ప్రమోషన్, ఇంక్రిమెంట్ల మాట అటుంచి ఉద్యోగం నిలబట్టుకోవడమే కష్టంగా మారిపోతుంటుంది. ఇంక్రిమెంట్లు ఎండమావుల్లా ఊరిస్తుంటాయే కానీ జీతంలో వచ్చి చేరవు. ఏడాదంతా కష్టపడి గొడ్డులా పనిచేస్తే...చివర్లో వచ్చే ఇంక్రిమెంట్ కోసం బిక్కమొగం వేసుకుని ఎదురు చూస్తుంటే... పదో పరకో మొహాన కొట్టే కంపెనీలు ఎన్ని లేవు. అలాగని ఆ ఉద్యోగాన్ని వదిలేసుకునే ధైర్యం చేయలేరు. ఇదేం గానుగెద్దులాంటి జీవితంరా బాబు. ఖర్చులు కొండవీటి చాంతాడంత...జీతం మాత్రం గొర్రెబెత్తడంత అని నిట్టూర్చుకోవడం మినహా చేయగలిగేదేం ఉండదు.

ఎవరికి ఏ అన్యాయం జరిగినా కోర్టు తలుపులు తట్టుతుంటాం. మనకు న్యాయవ్యవస్థపై అపారమైన నమ్మకం...గౌరవం. ఎవరు అన్యాయం చేసినా అక్కడ న్యాయం దొరికే దొరుకుతుందని అనుకుంటుంటాం. అంతటి ప్రతిష్టాత్మకమైన సర్వోన్నత న్యాయస్థానంలోని ఉద్యోగం చేసేవారిలో కొందరికి అత్యధికంగా ఇంక్రిమెంట్లు



దక్కుతున్నాయి. ఎంతటి ప్రతిభావంతుడికైనా ఏడాదికి ఒక ఇంక్రిమెంట్ న్యాయం ధర్మం. కానీ ఇక్కడ మాత్రం కొందరికి ఇబ్బడి ముబ్బడిగా ఇంక్రిమెంట్లు వచ్చేస్తున్నాయి. పోనీ వారు చేస్తున్న పనికి గుర్తింపా అంటే అదేం కాదు...బాస్ ను మెప్పించినందుకే ఈ నజరానాలు అని తెలుస్తోంది.

సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తులు వారు తమ పదవీ కాలం ముగిసే సమయాన...వ్యవధి ఎంత తక్కువ కాలం అయినా సరే... రిటైర్ అయ్యేటైములో తమకు నచ్చిన వారికి...తమను మెప్పించిన వారికి ఇంక్రిమెంట్లు అప్పనంగా ఇచ్చేస్తున్నారు. ఏడాదికి ఒకసారి కంటే ఎక్కువ సార్లు ఇవ్వడానికి ప్రధాన న్యాయమూర్తులు కొందరు వెనకాడటం లేదు. ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు వారికి అధికారం ఉందన్న ఏకైక కారణంతో తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనేది విమర్శ. ఉద్యోగులకు వృత్తిగత నైపుణ్యం లేకున్నా...ఏడాదికి రెండు మూడు ఇంక్రిమెంట్లు ఉదారంగా ఇస్తున్నారు. ఇలా లబ్ది పొందన వారిలో సీజేఐ పర్సనల్ సిబ్బందే అధికం.

ఈ అవ్యవహారాన్ని గత నాలుగైదేళ్లుగా గమనిస్తే...ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 2000మంది ఉద్యోగులకు ఒక ఏడాదలో పలుసార్లు ఇంక్రిమెంట్లు లభించాయి. ప్రధాన న్యాయమూర్తి కనుసన్నల్లో మెదిలిన కొందరు సిబ్బందికి ఆరుసార్లు ఇంక్రిమెంట్లు పడ్డాయంటే...పరస్థితి ఎంత దారుణంగా తయారైందో తెలుస్తోంది. సాధారణ పరిస్థితిలో లభించే ఇంక్రిమెంట్ల కంటే 150 శాతం అధికంగా లభించడం ఇక్కడ గమనించదగ్గ విషయం. ఇలా అవ్యవస్థగా సాగిన అవ్యవహారం గురించి చర్చించేందుకు మాజీ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ న్యాయమూర్తులతో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చాలా మంది న్యాయమూర్తులు కోర్టు ఎవరి సామ్రాజ్యమో కాదని... ప్రధాన న్యాయమూర్తులు ఇక్కడ రాజులు కారని, వారి ఇష్టారీతిగా ఏదో అగ్రహారాలు రాసిచ్చినట్లు ఇంక్రిమెంట్లు ఇవ్వడం సరికాదని భావించారు. సుదీర్ఘ చర్చానంతరం ఇలా ఇష్టారీతిగా ఇంక్రిమెంట్లు ఇచ్చే విధానాన్ని బంద్ చేయాలని ఫుల్ కోర్టు నిర్ణయించింది అలాగే కొందరు ఉద్యోగులకు అర్థరహితంగా ఇచ్చిన ఇంక్రిమెంట్లను ఉపసంహరించుకోవాలని కోర్టు భావిస్తోంది. పొరపాటు తెలుసుకుని సరిచేయడం సరే...అసలు సర్వోన్నత న్యాయస్థానంలో కొందరు ప్రధాన న్యాయమూర్తులు ఈ వ్యవహార శైలి ఏంటని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## ఐసిస్‌తో సంబంధాలు.. ఉగ్రవాదుల అరెస్ట్



ముంబైలో ఇద్దరు ఉగ్రవాదులను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాజన్, మనీష్ బేడీ అనే ఇద్దరు టెర్రరిస్టులు పాకిస్థాన్‌లోని ఐసిస్ ఉగ్రసంస్థ ఆదేశాల మేరకు భారత్‌లో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరంతా ఆర్మేనియా నుంచి ఆపరేట్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెలలో ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో (నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ) అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీగా సోదాలు నిర్వహిస్తుంది. అధికారులు ఇదివరకే పలువురు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఎర్రకోట వద్ద జరిగిన బాంబుపేలుళ్లలో 15 మంది మృతిచెందగా అనేక మంది గాయపడ్డారు. కాగా ఈ ఘటనతో సంబంధమున్న నిందితులను దర్యాప్తు బృందాలు ఇది వరకే అరెస్టు చేశాయి.

## భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో సర్వీసు ఫీజు పెంపు



భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో వసూలు చేసే సర్వీసు ఫీజును పెంచుతున్నట్లు న్యూజిలాండ్ ప్రకటించింది. ఈ పెంపు జనవరి 1 నుంచి కొన్ని కేంద్రాల్లో అమల్లోకి రానుంది. నిర్వహణపరమైన వ్యయాలు, ద్రవ్యోల్బణం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్ట్ మెంట్ వెల్లడించింది. న్యూజిలాండ్ వీసా కోసం ఇకముందు దరఖాస్తు చేసుకునేవారు ఈ మార్పును గమనించాలని సూచించారు. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, పాకిస్థాన్, శ్రీలంక, సింగపూర్, జపాన్ తదితర 25 దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. వీసా దరఖాస్తు ఫీజుకు అదనంగా వీసా అప్లికేషన్ కేంద్రాలు వసూలు చేసే ఫీజు ఉంటుందని ఆ దేశ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్ పేర్కొంది. ఇటీవల చేపట్టిన సిస్టమ్ అప్‌గ్రేడ్‌ల కారణంగా ఫీజు పెంపు చేపట్టవలసి వచ్చిందని తెలిపింది. దరఖాస్తులు సమర్పించే ముందు, ఫీజు వివరాలను సరిచూసుకోవాలని సూచించింది.

## శబరిమలలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

కేరళ పంబ తీర్థం స్వామియే శరణం అయ్యప్ప ప్రతిధ్వనుల తో మారుమోగిపోతుంది. ఏ వైపు చూసినా అయ్యప్పస్వాములే దర్శనమిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటికే అధిక మ్నొత్తంలో స్వాములు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం తెలిపింది. ఇప్పటివరకూ అయ్యప్పస్వామిని 25 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. శబరిమలలో అయ్యప్పస్వాముల రద్దీ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా అయ్యప్పభక్తులు పెద్దఎత్తున పంబ సన్నిధానానికి చేరుకుంటున్నారు. అయ్యప్పస్వామికి ఇరుముడి సమర్పించి తమ మ్నెక్కులు పూర్తి చేసుకుంటున్నారు. ప్రారంభంలో స్వామివారి దర్శనానికి కొన్ని ఇబ్బందులు తలెత్తినా ప్రస్తుతం ఏర్పాట్లు మెరుగైనట్లు కేరళ పోలీసులు తెలిపారు. గత ఏడాది ఈ సమయం వరకూ దాదాపు 21 లక్షల మంది స్వామివారి దర్శనం చేసుకోగా ప్రస్తుతం ఆసంఖ్య 25 లక్షలు దాటిందన్నారు. మండల పూజకోసం అయ్యప్పస్వామి (అభరణాల ఊరేగింపు) "తంగ అంకి" రథోత్సవం డిసెంబర్ 23 ప్రారంభమవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7గంటలకు అరణ్ముల పార్థసారధి ఆలయం నుంచి బయిలుదేరి 26న అయ్యప్ప సన్నిధానం చేరుకుటుందని తెలిపారు. 27వ తేదీన అభరణాల అలంకారం అనంతరం స్వామివారికి మండల పూజ జరుగుతుందని దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములందరూ వారికి కేటాయించిన సమయాలలో స్వామివారి దర్శనానికి రావాలని పోలీసులు సూచించారు. అలా చేయడం ద్వారా ఇ?బ్బందులు తలెత్తకుండా ఉండడంతో పాటు ప్రశాంతంగా దర్శనం చేసుకోవచ్చని కేరళ పోలీసులు తెలిపారు.

## లోక్‌సభలో వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకల సమావేశాల్లో భాగంగా ఈరోజు(సోమవారం, డిసంబర్ 15వ తేదీ) లోక్‌సభలో కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. అందులో ఒకటి వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు, మరొకటి ది రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్లు. ఈ రెండు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది కేంద్రం. అయితే వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును జేపీసీ(జాయింట్ పార్లమెంటరీ కమిటీ) పంపే అవకాశం ఉంది.

**వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు అంటే..**

ఉన్నత విద్య నియంత్రణను పూర్తిగా మార్చే ప్రయత్నంలో భాగంగా ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ వంటి సంస్థలను రద్దు చేసి వాటి స్థానంలో ఒకే గొడుగు కింద వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 12 మంది సభ్యులతో కూడిన వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే అత్యున్నత కమిషన్ ఏర్పాటుచేసి, ఉన్నత విద్యా విధానాలు, ప్రమాణాలు, నాణ్యత నియంత్రణను ఈ కమిషన్ పర్యవేక్షిస్తుంది. దీని ద్వారా కేంద్రానకి అధిక అధికారాలుంటాయి. దీని ఫలితంగా ఉన్నత విద్య నియమ నిబంధనలు అనేవి కేంద్రం నియంత్రణలోకి వస్తాయి. ముందుగా ప్రతిపాదించిన భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లును ఇప్పుడు వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లుగా మార్చారు.

**ప్రయోజనాలు**

సమగ్ర నియంత్రణగా అమలు చేయడానికి వీలవుతుంది. అన్ని ఉన్నత విద్యా సంస్థలకు ఒకే విధమైన ప్రమాణాలు.

విభిన్న సంస్థల మధ్య గందరగోళం తగ్గుతుంది.

ఒకే కమిషన్ ద్వారా విద్యా ప్రమాణాలు కఠినంగా అమలు చేయవచ్చు.

ది రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్లు

పాత చట్టాలను రద్దు చేయడం లేదా వాటిలో మార్పులు చేయడం కోసం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లు. ఇది కొత్త చట్టాలను తీసుకురావడానికి లేదా పాత చట్టాల్లోని అనవసరమైన, పాతబడ్డ నిబంధనలను తొలగించడానికి ఉపయోగిస్తారు ఇప్పటికే ఉన్న చట్టాల్లో మార్పులు చేయడం. ఉదాహరణకు, ఒక చట్టంలోని సెక్షన్‌లో పదాలను మార్చడం, కొత్త నిబంధనలను చేర్చడం, లేదా పాత నిబంధనలను సవరించడం జరుగుతంది. దీని ద్వారా చట్ట వ్యవస్థను సులభతరం చేయడం జరుగుతుంది.

రాజ్యసభలో ఎన్నికల సంస్కరణలపై చర్చ

మరొకవైపు రాజ్యసభలో ఎన్నికల సంస్కరణలపై చర్చ జరుగుతుంది. ఈ చర్చల్లో వైఎస్సార్‌సీపీ తరుపున ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఏపీ ఎన్నికల అక్రమాలపై ఎన్నికల సంఘం విచారణ జరపాలని ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ అక్రమాలకు బాధ్యులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. ఏపీలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓట్లలో అనేక తేడాలున్నాయన్నారు. సీసీటీవీ ఫుటేజ అందుబాటులో ఉంచాలన్నారు. ఈవీఎంలను నమ్మలేని పరిస్థితి వచ్చిందని, పేపర్ బ్యాలెట్‌పై అందరికీ నమ్మకం ఉందన్నారు వైవీ సుబ్బారెడ్డి.

# గులాబీకి ఊహించని ఫలితాలు



**హైదరాబాద్ :** తెలంగాణలో మొదటి దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇంట్రెస్టింగ్‌గా మారాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న అధికార పార్టీకి..బీఆర్ఎస్ కంటే ఎక్కువ స్థానాలే వచ్చాయి. అయితే ఫస్ట్ ఫేజ్ సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై అధికార కాంగ్రెస్ అంత స్యాటిస్‌ఫైగా లేదట. పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ.. మలి విడతలోనూ అదే జోరు కొనసాగించింది. ఆదివారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అత్యధిక స్థానాల్లో విజయబావుటా ఎగురవేశారు. మలి విడతలో 192 మండలాల పరిధిలోని 3911 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. 2200కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. మెజారిటీ సీట్లను సాధించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ తన పట్టును నిలుపుకున్నట్లయింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి కూడా మలి విడత ఫలితాలు కాస్త ఊరటనిచ్చాయి. మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే వీటిలో 415 స్థానాలు ఏకగ్రీవం కాగా.. ఐదు గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 3,911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. కాగా, రెండో విడతలో గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ రెబల్సే ఉండడం గమనార్హం.మొదటి విడతలో 4వేల 230 సర్పంచ్ స్థానాల్లో..ఏకగ్రీవాలతో కలిపి అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 2వేల 425 స్థానాల్లో గెలిచారు.ఇక బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 1,168 స్థానాల్లో గెలిచారు. బీజేపీ మద్దతు ఇచ్చిన స్థానాల్లో 189 మంది విజయం సాధించారు. సీపీఎం 24 సీట్లు, సీపీఐ 23 స్థానాలను గెలుచుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్రులు 401 స్థానాల్లో సత్తా చాటారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన స్థానాలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తోంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం ఆశ్చర్యపోతోందన్న చర్చ జరుగుతోంది.ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో కనీసం 80 నుంచి 90 శాతం స్థానాల్లో గెలవాల్సిందని కాంగ్రెస్ అనుకుంటుంటే, అసలు ఏ మాత్రం పోటీ ఇవ్వలేమని భావించిన బీఆర్ఎస్ లోలోన తెగ హ్యాపీగా ఫీల్ అవుతోందట. అవును..పంచాయితీ ఎన్నికలను పెద్దగా పట్టించుకోకపోయినా ఫస్ట్ ఫేజ్‌లో సానుకూల ఫలితాలు రావడంతో ఇప్పుడు సీరియస్‌గా దృష్టి పెట్టిందట కారు పార్టస్థానిక సంస్థల ఎన్నికల్లో ఎప్పుడైనా అధికార పార్టీదే అప్పర్ హ్యాండ్ ఉంటుంది. పవర్‌లో ఉన్న పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే మెజార్టీ స్థానాలను గెలవడం సర్వ సాధారణం. ఈ హోప్‌తోనే ఈ సారి పంచాయితీ ఎన్నికల్లో కనీసం 80 నుంచి 90 శాతం స్థానాల్లో విజయం సాధిస్తామని హస్తం పార్టీ ఆశించింది. కానీ మొదటి విడత ఎన్నికల్లో 57 శాతం స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందట. ఇదే ఇప్పుడు కాంగ్రెస్‌లో అసంతృప్తికి కారణంగా తెలుస్తోంది. ఇదే సమయంలో ఫస్ట్ ఫేజ్ పంచాయితీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు 27 శాతం అనుకూల ఫలితాలు వచ్చాయి.ఓ రకంగా ఇది గులాబీ పార్టీ కూడా ఊహించలేదని అంటున్నారు. ఎందుకంటే అసలు బీఆర్ఎస్ పార్టీ పంచాయతీ ఎన్నికలను అంత సీరియస్‌గా తీసుకోలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో కాస్త నిరాశలో ఉన్న గులాబీ పార్టీ లీడర్లు, క్యాడర్..పల్లె పోరుపై పెద్దగా దృష్టి పెట్టలేదు. కనీసం పార్టీ అధిష్టానం ఒక రివ్యూ కూడా చేయలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నచోట మినహా మిగతా నియోజకవర్గాల్లో సర్పంచ్ ఎన్నికలను కారు పార్టీ పెద్దగా పట్టించుకోలేదని ముందు నుంచి ప్రచారం జరుగుతోంది.స్థానిక సంస్థల ఎన్నికలను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇంచార్జీలు చూసుకుంటారులే అని బీఆర్ఎస్ అధిష్టానం లైట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార కాంగ్రెస్ పార్టీదే పైచేయి ఉంటుందన్న ఉద్దేశంతో పెద్దగా పట్టించుకోలేదని అంటున్నారు. దీంతో గులాబీ పార్టీ అధిష్టానంతో పాటు..మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు కూడా లోకల్ బాడీ ఎన్నికలను లైట్ తీసుకున్నట్లే పార్టీలో చర్చ జరిగింది.గ్రామాల్లో జోరుగా పంచాయతీ ఎన్నికల రాజకీయం నడుస్తోంటే ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్‌లో ఉన్నారని తెలంగాణ భవన్ వర్గాల్లోనే టాక్ వినిపించింది. అయితే అధిష్టానం నుంచి అండ లేకపోయినా, ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు పట్టించుకోకపోయినా..లోకల్ బీఆర్ఎస్ లీడర్లు మాత్రం పట్టుబట్టి..ఎన్నికల్లో ఫైట్ చేశారు. దీని ఫలితమే మొదటి విడత ఎన్నికల్లో 1,168 సర్పంచ్‌లను గెలిచేలా చేసిందని చెబుతున్నారు.ఏ మాత్రం ఊహించనట్లుగా ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో 1,168 సర్పంచ్ స్థానాలను గెలవడంతో బీఆర్ఎస్ అధిష్టానం అలర్ట్ అయ్యిందట. సీరియస్‌గా తీసుకోకపోయినా ఇన్ని స్థానాల్లో గెలిచామంటే అదే ఇంకాస్త దృష్టి పెట్టి ఉంటే మరింత మెరుగ్గా రిజల్ట్ వచ్చేవని చర్చించుకుంటున్నారట. అందుకే సెకండ్, థర్డ్ ఫేజ్ పంచాయతీ ఎన్నికలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీరియస్‌గా దృష్టి పెట్టారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మాజీ మంత్రులు, ఇంచార్జీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కేటీఆర్..మిగతా రెండు విడత ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది.దీంతో వెంటనే జిల్లాల్లో ముఖ్యనేతలంతా రంగంలోకి దిగినట్లు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు విడతల్లో మరిన్ని ఎక్కువ సర్పంచ్ స్థానాలను గెలుచుకునే పట్టుదలతో నేతలు పనిచేస్తున్నారట. కాస్త ఆలస్యంగా మేలుకున్న బీఆర్ఎస్‌కు సర్పంచ్ ఎన్నికల సమరం ముగిసే నాటికి ఎంతవరకు అనుకూల ఫలితాలు వస్తాయో చూడాలి మరి.

# కాలుష్య కాసారంగా రామగుండం...

**అదిలాబాద్ :** రామగుండం- జైపూర్ ఇండస్ట్రి యల్ కారిడార్ ప్రాంతం ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకర ప్రాంతంగా మారింది. వాయు, జల కాలుష్యంగా పతాక స్థాయికి చేరడంతో ప్రజారోగ్య పరిరక్షణ ప్రమాదంలో పడింది. ఈ ప్రాం తంలో సుమారు 15 లక్షల జనాభా ఉండ గా, సుమారు 6 వేల మంది క్యాన్సర్ బారిన పడ్డారు. వేలాది మందికి ప్రీ క్యాన్సర్ లక్షణాలు బయటపడ్డాయి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారీతిన బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు, సిమెం ట్ ఫ్యాక్టరీలకు అనుమతులు ఇస్తుండటం తో కాలుష్యం రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ ప్రాంతంలోని 5,400 మెగా వాట్ల థర్మల్ పవర్ ప్లాంట్లలో యాజమాన్యాలు ఏటా దాదాపు 50 లక్షల టన్నుల బొగ్గు మండిస్తున్నాయి. అలాగే సిమెంట్ తయారీ కోసం ఆ కంపెనీ 95 లక్షల టన్నుల బొగ్గును మండిస్తున్నది. ఇవి కాక త్వరలో రామగుండం ప్రాంతంలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పా టు చేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.అదేజరిగితే ఈ ప్రాంతంలో వాయు, జల కాలుష్యం అత్యంత ప్రమాదకరస్థాయికి పెరుగనుందని నిపుణులు హెచ్చరిస్తున్నా రు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాల ప్రకారం 5 మైక్రోగ్రా మ్ పర్ క్యూబిక్ మీటర్‌లో పీఎం 2.5 కాలుష్య రేణువులు ఉండటం ప్రమాదక రం కాదు. కానీ, నవంబర్ నెలలో రామగుండం పరిసర ప్రాంతాల్లో ఆ సూచిక 175- 250 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్ నమోదైంది. అంటే సురక్షిత పరిమితికి కంటే.. అది 35-50 రెట్లు ఎక్కువ. బొగ్గు మండిన తర్వాత మిగిలిన బూడిదలో దాదాపు 40 శాతం అల్యూమినియం అవశేషాలు ఉన్నట్లు తేలింది. ఈ బూడిద వ్యవసాయ భూములు, అడవుల్లో పడుతుండటంతో సారవంతమైన భూములు నిస్సారమవుతున్నాయి.



అటవీప్రాంతం పచ్చదనాన్ని కోల్పోతున్నది. అలా రామగుండం, కమాన్‌పూర్, జైపూ ర్ మండలాల్లో 80,000 ఎకరాలకు పైగా నిస్సారమైందని ఓ అంచనా.పంట దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు, కూలీల జీవనాధారం దెబ్బతింటోంది. భూగర్భజలాలు కూడా కలుషితం అవతుండటంతో తాగునీరు కూడా విషమ యమవుతున్నది. ఒకప్పుడు స్నానానికి ఉపయోగపడే 'సీ' కేటగిరీలో ఉన్న గోదావరి జలాలు ఇప్పుడు 'హెచ్' కేటగిరీకి పడిపోయింది. ఎన్‌టీపీసీ, జైపూర్ థర్మ ల్ ప్లాంట్, ఆర్ఎఫ్‌సీఎల్, బసంత్‌నగర్ సి మెంట్ ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే వ్య ర్థాలే కారణమని స్థానికులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా ఈ ప్రాంతంలో ఆనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రజారోగ్యం ప్రమాదపు అంచు నుంది. ఇటీవల రోహిణి అనే సంస్థ నిర్వహించిన ఓ వైద్య శిబిరంలో వైద్యులు 5,000 మందిని పరీక్షించగా, వీరిలో 183 మందికి ప్రీ లక్షణాలు ఉన్నాయని తేలింది. అలాగే 20 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. అలాగే ఎంతోమంది గుండె జబ్బులు, మూ?ర తపిండ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది.ఇక్కడ కొన్ని అకస్మాత్తు మరణాల సంఖ్య కూడా పెరుగు తండటం గమనార్హం. పరిస్థితి చేయిజారకముందే గోదావరిఖని, మంచిర్యాల, నస్పూ ర్ ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, 100 గ్రామ పంచాయతీల సర్పంచులు, 170 మున్సిపల్ వార్డు సభ్యులు వెంటనే స్పందించాలని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నది.విద్యుత్ ఉత్పత్తి కోసం యజామాన్యాలు ఏటా 50 లక్షల టన్నుల బొగ్గు, సిమెంట్ త యారీ కోసం 95 లక్షల టన్నుల బొగ్గును మండిస్తున్నది. పీఎం 2.5 స్థాయి డబ్ల్యూహెచ్‌వో పరిమితికి 35 రెట్లు ఎక్కువ న మోదవుతుండటం ఆందోళన కలిగించే విష యం. కాలుష్యంతో ఈ ప్రాంతంలో 80వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు నిస్సారమవుతున్నాయి. అటవీప్రాంతం కాలుష్యమై పచ్చదనాన్ని కోల్పోతున్నది. గోదావరి జలాల నాణ్యత 'సీ' కేటగిరీ నుంచి 'హెచ్' కేటగిరీకి పడిపోయింది. కాలుష్య ప్రభావంతో 15 లక్షల జనాభాలో సుమారు 6,000 మంది క్యాన్సర్ బారినపడ్డారు. మరకొంతమందిలో ఇప్పుడిప్పుడే క్యాన్సర్ లక్షణాలు బయటపడుతున్నాయి.

# బండి వర్సెస్ ఈటెల

**కరీంనగర్ :** కేంద్రమంత్రి బండిసంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్. ఇది కొత్త ఎపిసోడేం కాదు. తెలంగాణ స్థానిక ఎన్నికలు రాబోతున్నాయన్న ప్రచారం స్టార్ట్ అయినప్పటి నుంచే ఇద్దరు నేతల మధ్య కోల్డ్ వార్ రచ్చకెక్కింది. నువ్వానేనా అన్నట్లుగా ఒకరిపై మరొకరు ఇండైరెక్ట్ కామెంట్స్‌తో హీటెక్కించారు. తన పార్లమెంట్ పరిధిలో తన అనుచరులే అభ్యర్థులుగా ఉంటారని సంజయ్..హుజురాబాద్ తన ఇలాకా..అక్కడ తన అనుచరులే బరిలో ఉంటారు..గెలిపించుకుని తీరుతానంటూ ఈటల హాట్ కామెంట్స్ చేసి చర్చకు తెరలేపారు.ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసింది. ఇలా ఫస్ట్ ఫేజ్ ఎన్నికలు పూర్తయ్యాయో లేదో..మరోసారి వార్ ఆఫ్ వర్డ్స్ హీటెక్కిస్తున్నాయి. స్వయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఆఫీస్ నుంచి రిలీజ్ అయిన ఒక ప్రెస్ నోట్‌తో..పాత వివాదం కొత్త రచ్చకు దారితీసినట్లు అయింది. హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలంలో బోణీ కొట్టిన బీజేపీ..బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ర్యాకం శ్రీనివాస్ 90 ఓట్లతో విజయం అంటూ కేంద్రమంత్రి బండిసంజయ్ ఆఫీస్ ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది.వరకు ఓకే. కానీ ఈటల రాజేందర్ బలపర్చిన అభ్యర్థి ర్యాకం సంపత్ ఓటమి అంటూ ఆ పత్రికా ప్రకటనలో ఉండటమే రాద్ధాంతం అవుతోంది. ఈ ప్రెస్ నోట్ హుజురాబాద్ బీజేపీలోనే కాదు రాష్ట్ర పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలిచాడు అంటే సరిపోయేది..ఈటల రాజేందర్ బలపరిచిన అభ్యర్థి ఓడిపోయాడని పత్రిక ప్రకటన రిలీజ్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని చర్చించుకుంటున్నారట కొందరు నేతలు.బండి సంజయ్ ఆఫీస్ నుంచి విడుదలైన పత్రిక ప్రకటనపై పరోక్షంగా ఎంపీ ఈటల రాజేందర్ రియాక్ట్ అయ్యారు. మరింత మంట పుట్టించేలా..అవగాహన లేని వారు పెడుతున్న సోషల్ మీడియా పోస్టులపై పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఎన్నికలు ప్రజల్లో వారి వెనుకున్న నాయకుడు, పార్టీని చూసి అభ్యర్థులకు అండగా నిలుస్తున్నారు.గెలిచిన తర్వాత ఐదు లక్షలు 10 లక్షలు ఇస్తాం..మా పార్టీకి రండి..మా పార్టీలో గెలిచినట్టు చెప్పుకోండి అని చిల్లర ప్రయత్నం కొనసాగుతోందన్నారు. ఎన్నికల ముందే తమకు ఫలానా నాయకుడి ఆశీర్వాదం ఉందని చెప్తే మంచిది కానీ..గెలిచిన తర్వాత ఆయన వెనక..ఈయన వెనక పోతామంటే..ప్రజలు విశ్వసించే అవకాశం ఉండదంటూ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు కాక పుట్టిస్తున్నాయి. వర్గ విభేదాలు పక్కన పెట్టండి..తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయండి అంటూ..ప్రధాని మోదీ తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం వ్యక్తం చేశారని ప్రచారం జరిగి రెండు రోజులు కూడా కాలేదు..అంతలోపే బండి, ఈటల ఎపిసోడ్‌లో పార్టీ క్యాడర్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందట. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినా ఇద్దరు కీలక నేతల తీరు మారదా అంటూ గుసగుసలాడుకుంటున్నారట. రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు కూడా బండి, ఈటల తీరుతో తల పట్టుకుంటున్నారట. ఇక అధిష్టానమే జోక్యం చేసుకుని ఇద్దరు నేతలకు సర్దిచెప్పి..కలిసి పనిచేసేలా చేయాలని కోరుకుంటున్నారట నేతలు.

## ఇక కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

-మొదటిపేజీ తరువాయి

రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

**కేటీఆర్ ట్వీట్..**

'రెండో దశ పంచాయతీ ఎన్నికల్లోనూ అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ సత్తాచాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రత్యేకంగా అభినందనలు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా మరోసారి తేల్చిచెప్పారు. ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనం. రేవంత్ రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకు తోడు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే, కాంగ్రెస్‌కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయి. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రం చేస్తున్న రేవంత్ రెడ్డికి పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివి' అంటూ ట్వీట్ చేశారు. 'నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం. కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిన నేపథ్యంలో ఇక సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం కాయం. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై అనునిత్యం బీఆర్ఎస్ సాగిస్తున్న సమరాన్ని గుండెల నిండా ఆశీర్వదిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంది' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలి

-మొదటిపేజీ తరువాయి

సంఘాల జేఏసీ ధర్నా నిర్వహించింది. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్లు 42%కు పెంపు చట్టానికి ఆమోదం కోరుతూ ఆందోళన చేపట్టింది జేఏసీ. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేసింది. సామాజిక రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం పరిమితి ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ ధర్నాలో మహేష్‌గౌడ్‌తో పాటు వి. హనుమంతరావు, విల్సన్ ఎంపీ (డిఎంకే), కే. నారాయణ (సిపిఐ), వి. శ్రీనివాస్ గౌడ్, వద్దిరాజు రవిచంద్ర ఎంపీ, మల్లు రవి ఎంపీ, అనిల్ కుమార్ యాదవ్‌లు హాజరయ్యారు.

## ప్రధాన పార్టీలకు స్వతంత్రుల ఝలక్

-మొదటిపేజీ తరువాయి




బరిలో నిలిచారు. ఓట్ల లెక్కింపు అనంతరం కాంగ్రెస్ పార్టీ మద్ధతుదారులు 199 చోట్ల విజయం సాధించి మొదటి స్థానంలో నిలిస్తే, 117 స్థానాలతో బీజేపీ రెండో స్థానంలో స్థానంలో నిలిచింది. ఇక బీఆర్ఎస్ 99 స్థానాలతో మూడో స్థానానికి పరిమితమైంది. ఇండిపెండెంట్ అభ్యర్థులు 82 చోట్ల గెలుపొందటం రాజకీయ వైవిధ్యాన్ని చాటింది.

కాంగ్రెస్ పార్టీ : మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో హస్తం పార్టీ ఆధిక్యతను ప్రదర్శించింది. బీఆర్ఎస్ నామమాత్రపు ఉనికిని చాటుకుంది. కొన్నిచోట్ల ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలవగా, బీజేపీ అసలు ఖాతానే తెరవలేకపోవడం గమనార్హం. రాష్ట్రమంత్రి వివేక్ సోదరుడైన ఎమ్మెల్యే వినోద్ ప్రాతినిధ్యం వహిస్తున్న బెల్లంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నాలు కూడా అంతగా ఫలించలేదు. బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల, కన్నెపల్లి, వేమనపల్లి, భీమిని మండలాల్లో కాంగ్రెస్? పార్టీ ఆధిక్యతను ప్రదర్శించింది.

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(టి) నియోజకర్గం పరిధిలో హస్తం పార్టీ వెనకబడింది. ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం ఆధిక్యతను ప్రదర్శించింది. అదే నియోజకవర్గం పరిధిలోకి వచ్చేసరికి బీజేపీ కంటే వెనకబడింది. నిర్మల్ జిల్లాలో హస్తం పార్టీ రెండో స్థానానికి పరిమితమైంది. మాజీ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి తన స్వగ్రామం ఎల్లపల్లిలో సైతం తన అభ్యర్థిని గెలిపించుకోలేకపోవటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**కమల వికాసం:**

మొదటి విడత ఎన్నికలతో పోల్చితే రెండో విడతలో కమలం వికసించిందని చెప్పవచ్చు. ప్రధానంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలైన పాయల్ శంకర్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్ ప్రాంతాల్లో స్పష్టమైన ఆధిక్యతను చాటుకుంది. క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావటంతో కమల శ్రేణుల్లో ఉత్సాహం కనిపించినప్పటికీ, చాలాచోట్ల స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారు గెలుపొందటం ప్రాధాన్యతను సంతరించుకుంది. కుమురం భీం జిల్లాలో సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్?బాబు నియోజవకర్గంలో 22 పంచాయతీలను కైవసం చేసుకున్నప్పటికీ బెల్లంపల్లి నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క సర్పంచి స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది.

**వన్నెతగ్గిన గులాబీ:**

ఉమ్మడి జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గంలో కోనప్ప చొరవతో ప్రభావం చూపిన బీఆర్ఎస్?, బోథ్ నియోజకర్గంలో స్వల్ప ఆధిక్యతను సాధించింది. మిగిలిన చోట్ల దాని ప్రభావం మాత్రం పెద్దగా కనిపించలేదు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని మాజీమంత్రి జోగు రామన్న ప్రయత్నం చేసినప్పటికీ మూడో స్థానానికే పరిమితమవగా, నిర్మల్ జిల్లాలోనైతే పూర్తిగా చతికిలపడింది. ఈ స్థానిక సంస్థల ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు కొన్నిచోట్ల విజయం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ముగిసిన తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం

రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎలక్షన్ డిసెంబర్ 17న జరగనుంది. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఇవాళ్టితో ముగిసింది. ఇన్ని రోజులు గ్రామాల్లో హోరెత్తించిన మైకులు మూగబోయ్యాయి. డిసెంబర్ 17న 182 మండలాలు 4157 గ్రామ పంచాయతీలు,28, 406 వార్డుల్లో పోలింగ్ జరగనుంది. తుది విడతలో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 26 లక్షల 1861 పురుష ఓటర్లు, 27 లక్షల 4 వేల 394 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలానే146 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల కోసం 36 వేల 483 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇవాళ(సోమవారం) సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఎల్లుండి(బుధవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ దుమ్మురేపింది. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామ, నిర్మల్ జిల్లాల మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలి విడత మాదిరిగానే రెండో విడతలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మద్దతుదారులకు నిర్మల్ జిల్లాలో మెజారిటీ స్థానాలు వచ్చాయి.

## సంపాదకీయం

# గిగ్ వర్కర్లకు పని భద్రత కరవు!

అభివృద్ధి ముసుగులో 'గిగ్' వర్కర్ల పేరుతో కొత్త సేవలు విస్తరిస్తున్నాయి. వినిమయదారులు ఉన్న చోటికే వాహనాలు ఆన్‌లైన్ బుకింగ్‌తో వస్తున్నాయి. వినియోగదారులకు ఇది సౌకర్యవంతంగా ఉన్నది. మరి డ్రైవర్ల పరిస్థితేమిటి? కస్టమర్లతో వీరు వ్యక్తిగతంగా పని కుదుర్చుకొని పూర్తి చేస్తారు. దానికి పరిహారం వినియోగదారుల నుంచి పొందుతారు. ప్రత్యేకంగా 'యాజమాన్యం- కార్మికులు' అన్న సంబంధం ఉండదు. చేసిన కాలానికి కాకుండా, పూర్తి చేసిన పనికి పరిహారం పొందుతారు. సంప్రదాయంగా ఉండే పనిస్థలం ఉండదు. ఇది సమిష్టి, సామూహిక కృషి కాదు. ఉబెర్, ఓలా, పోర్టర్ తదితర ప్లాట్‌ఫారాలకు అనుసంధానంగా పనిచేసే వారితోపాటు, అనుసంధానం కాని ఇతర కార్మికులు కూడా, ఈ పద్ధతిలో పనిచేసే వారంతా 'గిగ్' వర్కర్స్ అంటున్నారు. కానీ క్రమంగా, ప్లాట్‌ఫారంతో అనుసంధానం కాకుండా ఉండే 'గిగ్' వర్కర్స్ నిలదొక్కు కోవడం సాధ్యం కాదు. ఏదో ఒక యాప్ ప్రాతిపదికన పనిచేసే ప్లాట్‌ఫారంతో అనుసంధానం కావల్సిందే. పూర్తిగా ఇదే జీవనాధారంగా పనిచేసే వారితో పాటు, పార్ట్‌టైమ్ ఆదాయం కోసం చేసే వారి సంఖ్య కూడా పెరుగుతున్నది. ఇప్పుడిప్పుడే ఈ రంగంలో యువతులు కూడా ప్రవేశిస్తున్నారు. తెలంగాణలో 8 నుంచి 10 లక్షల మంది గిగ్ వర్కర్స్ ఉంటారు. అత్యధికులు హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్నారు. వీరి పని స్వభావం స్థూలంగా అత్యంత అస్థిరమైన, అనిశ్చితమైంది. వీరికి కార్మిక చట్టాలేవీ వర్తించవు. లేబర్ కోడ్స్ కూడా వీరి సమస్యలకు పరిష్కారం చూపలేదు. యాప్ ప్రాతిపదికన వీరితో పని చేయిస్తున్న ప్లాట్‌ఫారాల యాజమాన్యాల మీద కూడా చట్టపరమైన పర్యవేక్షణ లేదు. వీరికి కూడా ఏ చట్టమూ వర్తించదు. కార్మికులకూ, వినియోగదారులకు మధ్య తాము మధ్యవర్తులంగానే సేవలందిస్తున్నామనీ, ఈ కార్మికులతో తమకేం సంబంధం లేదనీ ఇప్పటికే ప్రకటించారు. కార్మికుల గురించి ఎలాంటి బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా లేరు. పైగా తాము సామాజిక సేవలందిస్తున్నామంటున్నారు. వీరికి ఆదాయమే తప్ప బాధ్యతలు లేవు. ఏ సంబంధమూ లేదంటూనే, ఆన్‌లైన్‌లో కార్మికులను నియంత్రిస్తున్నారు. యాజమాన్యం నుంచి ఏక పక్ష నియంత్రణే తప్ప, కార్మికులు సంప్రదించేందుకు, ఫిర్యాదు చేసేందుకు అవకాశం లేదు. కార్మికులుగా వీరికి గుర్తింపు లేదు. పని భద్రత లేదు. సెలవులు, వైద్యం, ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ లాంటి సామాజిక భద్రతలేవీ వర్తించవు. పరిమిత ఆదాయం, అది కూడా స్థిరంగా ఉండదు. భౌతిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడులు పెరుగుతున్నాయి. గిగ్ ఆర్థిక వ్యవస్థ గొప్ప ముందడుగుగా ప్రచారం జరుగుతున్నది. యువతకు కొత్త అవకాశాలు అందిస్తున్నదని చెబుతున్నారు. ఈ పనికి ముద్దుపేర్లు పెట్టి మభ్యపెడుతున్నారు. కార్మికులు అని కాకుండా భాగస్వాములు (పార్ట్‌నర్స్) అని అంటున్నారు. నిజానికి బానిసలని చెప్పవచ్చు. వీరిని స్వతంత్ర కాంట్రాక్టర్లుగా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ వీరు స్వతంత్రులుగా కనిపిస్తున్నప్పటికీ, స్వతంత్ర కార్మికులుగా కూడా లేరనేది స్పష్టం. ప్లాట్‌ఫారాల యాజమాన్యాల చుట్టూ, దిక్కులేని పక్షుల్లా తిరగవల్సి వస్తున్నది. మరో ప్రత్యామ్నాయం లేకనే ఈ పనిలో ఉండవల్సి వస్తున్నది.ఈ పని ఎప్పుడైనా ఉపయోగించుకోగలిగే విధంగా, కార్మికులకు అనువైనదిగా చెబుతున్నారు. కార్మికుల మీద ఎవరి నియంత్రణ, ఆధిపత్యం లేని స్వయం ప్రతిపత్తి ఉంటుందన్నారు. తమ పని మీద తమకే అధికారం, పట్టు ఉంటుందని ప్రచారం జరుగుతున్నది. వెంటవెంటనే చెల్లింపులు జరుగుతాయనీ, ఎక్కువ సమయం పని చేసి ఎంతైనా సంపాదించుకోవచ్చంటున్నారు. పనిలో చేరడానికి ఎలాంటి అవరోధాలు లేవు. ఒక సెల్‌ఫోన్, వాహనం, కనీసస్థాయిలో చదువుంటే చాలు అంటున్నారు. ఉపాధి సమస్యలు, నిరుద్యోగ సమస్య నుంచి ప్రజల దృష్టి మరలించడానికే ఈ వాదనలు. పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకోసమే ఈ ప్రచారాలు. గిగ్ వర్కర్స్ అభద్రతా భావంతో సతమతమవుతున్నారు. అయినప్పటికీ వేగంగా విస్తరించడానికి రెండు కారణాలు. గిగ్ వర్కర్స్ అందించే సేవలు ప్రజలకు బాగా ఉపయోగపడుతున్నాయి. చవక గానూ, అందుబాటులో ఉంటున్నాయి. అందువల్ల వినియోగదారులు వీరి సేవలకు ఆకర్శితులవుతున్నారు. వినియోగదారులకది సౌకర్యవంతమైనదే! కానీ 'గిగ్' వర్కర్ల పాలిట శాపంగా తయారైంది. పెరుగుతున్న డిమాండ్‌ను ఉపయోగించుకొని, ప్లాట్‌ఫారాల యాజమాన్యాలు, యువత శ్రమను పిండుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాలు, బెదిరింపులు జరిగినప్పుడు వీరికి భద్రత లేదు. వినియోగదారులు డబ్బు చెల్లించకపోతే యాజమాన్యానికి బాధ్యత లేదు. పోలీసులు చలానా వేస్తే డ్రైవర్ భరించవల్సి వస్తున్నది. బుక్ చేసి మధ్యలో క్యాన్సిల్ చేస్తే మినిమమ్ ఫేర్ లేదు. వెయిటింగ్ చార్జీ లేదు. రోడ్ బ్లాక్ అయినా, ట్రాఫిక్ సమస్య ఏర్పడినా రేటు మారదు. పైపులు, కంకర, ఇసుక, పశువుల రవాణాకు వేర్వేరు వాహనాలు ఉపయోగించాలి. వాహనంలో అదనపు లోడ్, అదనపు ఎత్తు లేదా పొడవు సరుకు లోడ్ చేయ టం చట్ట విరుద్ధం. అంగీకరించకపోతే డ్రైవర్లదే బాధ్యతగా క్యాన్సల్ చేస్తున్నారు. అంగీకరిస్తే పోలీసులు వేధిస్తున్నారు. ఒకే బండి, ఒకే కిరాయితో ముగ్గురు, నలుగురు కస్టమర్ల నుంచి సరుకు పిక్అప్ బుక్ చేస్తున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ పనులు కూడా డ్రైవర్లే చేయాలని వత్తిడి చేస్తున్నారు. ప్లాట్‌ఫారం యాజమాన్యం కస్టమర్లకు వెయింటింగ్ టైమ్ సౌకర్యం ఇస్తారు. ఆ భారం డ్రైవర్ల మీద పడుతున్నది. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్స్‌లో 20 నుంచి 30 నిమిషాలు వృధా అవుతున్నది. ఎయిర్‌పోర్టుకు పోయేటపుడు చెల్లించే రేటు, తిరుగు ప్రయాణంలో ఇవ్వటం లేదు. గిగ్ వర్కర్స్‌కు టాయిలెట్స్, మంచినీరు, పార్కింగ్ స్థలం, నిలువ నీడ వంటి సమస్యలున్నాయి. వారంలో కనీసం 75 గంటలు పనిచేసి, అరవై శాతం పనితనం ప్రదర్శించిన వారికి మాత్రమే ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నారు. కానీ ఇందుకు అనేక ఆంక్షలు. ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య లాగిన్ అయ్యింది మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. మిగిలిన సమయంలో తీసుకున్న బుకింగ్స్, లాగిన్ సమయం పరిగణలోకి తీసుకోరు. రోడ్డు ప్రమాదం జరిగితే, ఆ వారంలో 72 గంటలు లాగిన్ అయి ఉంటేనే వర్తిస్తుంది.కొన్ని యాజమాన్యాలు తమకూ, డ్రైవర్లకు మధ్య వెండార్స్ పేరుతో కొందరితో ఒప్పందం చేసుకుంటున్నారు. దగ్గరి బుకింగ్స్ అన్నీ వెండార్స్ పోతాయి. డ్రైవర్లను వెండార్స్ వైపు నెట్టుతున్నారు. కస్టమర్లు డ్రైవర్లకు నగదు చెల్లించినప్పటికీ, వీరు యాజమాన్యానికి ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. జమ చేయాల్సిన మొత్తం రూ.2 వేలు దాటితే బుకింగ్స్ ఆగిపోతాయి. చెల్లించిన తర్వాతనే మొదలవుతాయి. సాధారణంగా రేట్లు పెరుగుతూ ఉండాలి. డ్రైవర్ల ఆదాయం పెరుగుతూ ఉండాలి. కానీ గత సంవత్సరంతో పోల్చితే సగానికి పడిపోయింది. యాజమాన్యాల వేధింపులకు అడ్డు, అదుపూ లేదు. బుకింగ్స్ ఒప్పకోలేదనే పేరుతో యాప్ ప్లాట్‌ఫారం నుంచి సస్పెండ్ లేదా డిస్మిస్ చేస్తారు. ఎక్కువ బుకింగ్స్ క్యాన్సిల్ అయినా ఐడీ బ్లాక్ చేస్తున్నారు. ఒకసారి సస్పెండ్ అయిన డ్రైవర్ మళ్లీ ప్లాట్‌ఫారంతో అనుసంధానం కావాలంటే పోలీసుల దగ్గర నుంచి లెటర్ తేవాలంటున్నారు. ప్యాసింజర్ ఆటోలకు గూడ్స్ ట్రాన్స్‌పోర్టు బుకింగ్ ఇస్తున్నారు. ఒప్పుకోకపోతే సస్పెండ్ చేస్తున్నారు. ఒప్పుకుంటే పోలీసులు చలాన్లు వేస్తున్నారు. కొత్తలో డ్రైవర్లకు ఆకర్షణీయమైన ఆదాయం ఉంటుందని నమ్మించారు. క్రమంగా కస్టమర్లను ఆకర్శించేందుకు రేటు తగ్గిస్తూ వచ్చారు. కానీ యాజమాన్యం కమీషన్ మాత్రం పెంచుకుంటున్నది. వెయిటింగ్ టైమ్‌కు కస్టమర్ మీద అదనంగా రేటు పెంచిన సందర్భాలలో కూడా ఆ డబ్బు కూడా తీసుకుంటున్నది. డ్రైవర్ చాలా దూరం ప్రయాణించిన తర్వాత, చివరి సమయంలో కస్టమర్ క్యాన్సల్ చేస్తే, కస్టమర్ మీద వేసే జరిమానా డబ్బు కూడా యాజమాన్యమే తింటున్నది. పెట్రోల్/డీజిల్ ఖర్చు భరించేది, సమయం నష్టపోతు న్నది డ్రైవర్లు. తమ వాహనం మీద కంపెనీ అడ్వర్‌టైజ్‌మెంట్ స్టిక్కర్ వేయాలి. అందుకు యాజమాన్యం చెల్లించేది కేవలం వెయ్యి రూపాయలు. కానీ చిన్న గీతపడినా రూ.5 నుండి 7 వేలు ఖర్చు పెట్టి కొత్త స్టిక్కర్ వేయాలి. మార్కెట్‌లో ప్లాట్‌ఫారాల మధ్య పోటీలో వినియమదారులకు రకరకాల ఆఫర్లు ఇస్తున్నారు. నష్టపోతున్నది డ్రైవర్లే. సాధా రణంగా కస్టమర్లు గమ్యం చేరిన తర్వాత ఫీడ్‌బ్యాక్ ఆప్షన్ పట్టించుకోరు. ఫీడ్‌బ్యాక్ ఇవ్వకపోయినా. ఆదాయం కోత పెట్టి యాజమాన్యం మింగుతున్నది. కమీషన్‌కు అదనంగా యాజమాన్యాలు ప్లాట్‌ఫారం చార్జీ పేరుతో అదనంగా రూ.20 కోత పెడుతున్నారు. మొత్తం మీద, వీరిమధ్య పోటీలో కస్టమర్లను నిలుపుకునేందుకు, పెంచుకునేందుకే ప్రాధాన్యత. కష్టాలు డ్రైవర్లకూ, లాభాలు యాజమాన్యాలకు. రోడ్డు ప్రమాదంలో ప్రయాణీకులు, డ్రైవర్లు గాయపడినా, వాహనం ధ్వంసమైనా. ప్లాట్‌ఫారం యాజమాన్యం ప్రయాణికుల కోసం మాత్రమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రైవర్లను పట్టించుకోరు.

# వచన కవితా పితామహుడు కుందుర్తి

అభ్యుదయ కవిగా, రచయితగా, వచన కవితా ఉద్యమ ఆధ్యునిగా, నయాగరా కవులలో ఒకరిగా తెలుగు సాహితీ ప్రియులకు సుపరిచితుడు వచన కవితా పితామహుడు అనే బిరుదాంకితుడైన కుందుర్తి ఆంజనేయులు. ఆయన అభ్యుదయ కవి, ప్రముఖ తెలుగు రచయిత. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. తన కవిత్వంతో తెలంగాణా సాయుధ పోరాటానికి అజ్యం పోసిన కవులలో ప్రముఖుడు. పాతకాలం పద్యమైతే, వర్తమానం వచన గేయం....అని ఎలుగెత్తి చాటిన వచన కవితోద్యమకారుడు కుందుర్తి. సాంప్రదాయ పద్యానిదే పై చేయిగా ఉన్నరోజుల్లో ఛందస్సు పై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు కుందుర్తి. ఆంజనేయులు 19 22 డిసెంబర్ 16 న కామయ్య , నరసమ్మ దంపతులకు నర్సారావు పేట సమీపంలోని కోట వారి పాలెంలో వ్యవసాయ బ్రాహ్మణ కుటుంబములో జన్మించాడు. ఆయన వినుకొండలో చదువుకున్న కాలములో గుర్రం జాషువా ఆయనకు తెలుగు మాష్టారుగా బోధించారు. 1936 నుండి 1941 వరకు విజయవాడ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో చదివాడు. అక్కడే 1937లో కవిత్వం వ్రాయటం ప్రారంభించాడు. విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో అయన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వద్ద శిష్యునిగా ఉన్నాడు. ఆ తరువాత గుంటూరు ఆంధ్రా క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ ఉత్తీర్ణుడు అయినాడు. ఆంజనేయులు నరసరావుపేటలో నవ్యకళా పరిషత్తు స్థాపించాడు. ఆ కాలంలోనే ఆయన కమ్యూనిష్టు భావాలకు ఆకర్షితుడైనాడు. దేవేంద్రపాడు గ్రామములోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా, ప్రిన్సిపాలుగా పనిచేశాడు. అనంతరం గుంటూరు పొగాకు మార్కెట్ లో పని చేశాడు. 1956లో కర్నూలులో సమాచార ప్రసారశాఖలో అనువాదకునిగా చేరాడు. ఆ తరువాత హైదరాబాదుకు బదిలీ అయ్యాడు. 1958లో ఫ్రీవర్స్ ఫ్రంట్ స్థాపించాడు. 1967లో



యువతలో వచన కవిత్వాన్ని ప్రోత్సహించ డానికి ఉత్తమ వచన కవిత్వానికి ఒక బహుమతి అందజేయడం ప్రారంభించాడు. 1977లో ఉద్యోగ జీవితము నుండి విరమణ పొందాడు. 1944లో కుందుర్తి అంజనేయు లు... ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి మొట్టమొదటి కవితా సంకలనం నయగారా ప్రకటించాడు. ఈ ముగ్గురూ నయగారా కవులుగా ఆధునిక తెలుగు సాహిత్యములో ప్రసిద్ధి చెందారు. అంజనేయులు సమగ్ర రచనలు 1974లో ప్రచురించ బడినవి. తెలంగాణ కవితా సంపుటిలో మొత్తం 26 కవితలున్నాయి. కుందుర్తి అనేక పురస్కారాలు అందుకున్నాడు. వాటిలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు 1969లో అందుకున్న సోవియట్ లాండ్ నెహ్రూ పురస్కారము ప్రతిష్ఠాత్మకమైనవి. మహా భారతం తరహాలో తెలంగాణా పోరాట కథను 18 పర్వాలు గా విభజించి తొలిసారిగా వచన కవిత్వంలో మహా కావ్యాన్ని రాసిన ఘనత కుందుర్తి కే దక్కుతుంది. సాహిత్యాన్ని పామరులకు సైతం దగ్గరగా తీసుకు వెళ్లిన గొప్పతనం వచనానిదే. అందుకే కుందుర్తి వచన కవిత్వానికి ఆద్యుడైనాడు. కుందుర్తి పేరు జ్ఞప్తికి తెచ్చుకుంటే గుర్తుకు వచ్చే కవిత " నగరంలోని వాన".నగరంలో వాన కవిత్వం నా ఊహాంచలాల్లో కదిలాడుతున్నట్లు జల్లులు జల్లులై కురుస్తుంది " అంటూ మొదలై, నగరంలో కురిసే వాన మనుషులతో ఆడే దాగుడు మూతలు , నగర వాసులకు కలిగించే ఇబ్బందులు, అప్పుడప్పుడు చూపించే కనికరం అన్నింటిని హృద్యంగా వర్ణించాడు కుందుర్తి. గాంధీజీ హతుడైన సందర్భంలో "మహాత్ముడిక లేడు" అనే కవితలో " గౌరీ శంకర శిఖరం యేరుగా పారింది, గంగానది శోక బాష్పములు కాల్వలు కట్టింది, వెన్నెల హృదిలో, తమస్సు తెర విరిసింది, నీవు వాటికి సహోదరుడువు, వాటి కీర్తికి సహోదరుడవు" అంటూ వర్ణించాడు. ఆయన రచనలలో సౌప్తికం, రసధుని, అమావాస్య, నా ప్రేయసి, నయాగరా, తెలంగాణ, దండియాత్ర, ఆషా, నగరంలో వాన, నాలోని వాదాలు, హంస ఎగిరిపోయింది, తీరా నేనుకాస్త ఎగిరిపోయాక, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి పీఠికలు, కుందుర్తి వ్యాసాలు, బతుకు మాట మొదలైనవి ముఖ్యమైనవి. వచనాన్ని సాహిత్యముగా పరిగణించని రోజులలో కందుర్తి వచన కవిత్వాన్ని ప్రోత్సహించాడు. సాంప్రదాయ పద్య కవిత్వము గతమని, వచన కవిత్వము వర్తమానమని చాటాడు. 1982 అక్టోబర్ 25న మరణించాడు. ఆయన మరణించిన తరువాత ప్రముఖ సాహితీ సమితి రంజని ఆయన పేరిట 1984 నుంచి ఇప్పటి వరకు ఏటేటా వచన కవితల పోటీలు నిర్వహించి అవార్డులు ప్రకటిస్తూ ఉంది. మరణించిన తరువాత కూడా ఆయన యువ కవులకు ఈ విధంగా స్ఫూర్తి ప్రదాతగా నిలిచే ఉన్నాడు.

# ప్రజాసేవే పరమార్ధమైన మహా దాత

చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాంధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు.చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు.మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకా నంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజమాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది. స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపా ధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్త వానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటొ మూర్తిరాజుకి తెలిసింది. మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయవాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉన్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు. అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళ పూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు. కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొత్రాప్రగడ శ్రీరామారావు (ప్లీడదు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు. మూర్తిరాజు, స్నేహితులు కలసి సమావేశాలు ఏర్పాట్లు చేసేవారు. మూర్తిరాజు తణుకులో 1934 నుండి 1939 వరకు విద్యాభ్యాసం చేసారు. 1939 మార్చి నెలలో స్కూలు ఫైనల్ పరీక్ష జరగగా, అందులో ఫెయిలయ్యారు. దానితో చదువు మాని స్వగ్రామానికి తిరిగివెళ్ళారు. ఆతర్వాత చదువు కొనసాగిం చడానికి ప్రయత్నించలేదు. తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగి పోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100 ఎకరాల భూమిని దానం చేశారు. 1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్‌సీ వరకు చదివినా చదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు. బాపిరాజు ధర్మసంస్థ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. వాటన్నింటికి దేశ నాయకుల పేర్లు పెట్టారు. కుటుంబంలో మహిళ చదువుకుంటే ఆ ఇల్లంతా విద్యావంతులవుతారనేది ఆయన దృఢ విశ్వాసం. అందుకోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. కళల్ని సాహిత్యాన్ని ప్రేమించే మూర్తిరాజు కళాకారులకు ఎందరికో ఉపాధి చూపించారు. భూరి విరాళాలిచ్చి అభినవ భోజుడిగా పేరుపొందారు.. నేడు సినీరంగంలో ప్రముఖ హాస్య నటునిగా కొనసాగుతున్న ఎంఎస్ నారాయణ, పురాణ వ్యాఖ్యాత మైలవరపు శ్రీనివాసరావు ఆయన నెలకొల్పిన పాఠశాలల విద్యార్థులే. ప్రముఖ రచయిత, నటులు పరుచూరి గోపాలకృష్ణ ఆయన స్థాపించిన కళాశాలలో అధ్యాప కులుగా పనిచేశారు. మాజీ మంత్రులు దండు శివరామరాజు, మరో మాజీ మంత్రి కంతేటి సత్యనారాయణ రాజులు ఆయన శిష్యులే. శ్వాసకోశ, గుండె సంబంధ వ్యాధులతో 2012 నవంబర్ 12న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచారు.

# విజయ్ దివస్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో భారత త్రివిధ దళాలు గెలుపొందిన శుభ దినంగా 16 డిసెంబర్ రోజున దేశవ్యాప్తంగా "విజయ్ దివస్" వేడుకలను సగర్వంగా, ఘనంగా నిర్వహించుకోవడం ఒక ఆనవాయితీగా వస్తున్నది. బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్ విముక్తి పోరాటంగా 03 డిసెంబర్ 1971న ప్రారంభమైన ఇండియా-పాకిస్థాన్ యుద్ధం13 రోజుల పాటు కొనసాగిన పిదప 16 డిసెంబర్ 1971 రోజున పాకిస్థాన్ ఓటమిని అంగీకరించడంతో బంగ్లాదేశ్ ఒక స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడం, ఇండియా త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ లొంగిపోవడం, భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌లో విజయోత్సవాలు నిర్వహించడం జరిగింది. నాటి నుండి ప్రతి ఏట మన త్రివిధ దళాల పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ నాటి యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళులు అర్పించడం, గాయపడిన సైనికులకు కృతజ్ఞతలు తెలియజేయడా సాంప్రదాయంగా వస్తున్నది.ఈస్ట్ పాకిస్థాన్, వెస్ట్ పాకిస్థాన్‌లో మధ్య తారస్థాయికి చేరిన విభేదాలు: 1947లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత జరిగిన తీవ్ర పరిణామాల్లో దేశం భారత్, పాకిస్థాన్ అనబడే రెండు ముక్కలుగా విభజించబడడం, విభజన తీవ్ర రక్తపు మరకలతో జరగడం చూసాం. విభజన తర్వాత నూతనంగా ఏర్పడిన పాకిస్థాన్‌లో ఈస్ట్ పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్), వెస్ట్ పాకిస్థాన్ (నేటి పాకిస్థాన్) అన రెండు ప్రాంతాలు చేరడం జరిగింది. వెస్ట్ పాకిస్థాన్ అణచివేత చర్యలతో ఈస్ట్ పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ నలిగి పోవడం, రెండు ప్రాంతాల ప్రజల మధ్య తీవ్రమైన విభేదాలు పొడచూపడంతో రెండు ప్రాంతాల మధ్య తీవ్ర ఘర్షణలు కొనసాగడం జరిగింది. నాటి పాకిస్థానీ




జనరల్ యేహ్యా ఖాన్ దుందుడుకు చర్యలు, బంగ్లాదేశీయులను అణిచివేత, మహిళల మానభంగాలు, అమానవీయ మారణహోమంతో రెండు పాకిస్థానీ ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం పొడచూపడంతో బంగ్లాదేశ్ స్వతంత్రం కోసం యుద్ధం అనివార్యం అయ్యింది. ఈ పోరాటంలో బంగ్లాదేశ్ "ముక్తి బహిణి" దళాల భాగస్వామ్యం కూడా ప్రధానమైనదిగా పేర్కొనబడింది. బంగ్లాదేశ్ ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా వెస్ట్ పాకిస్థాన్ ప్రభుత్వం పని చేయడంతో "బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్"లో తమ స్వతంత్రం కోసం "బంగ్లా విముక్తి" పోరాటాలు ఎగిసిపడడం, దానికి నాటి ఇందిరాగాంధీ నేతృత్వపు భారత ప్రభుత్వం కూడా సహకరించడం గమనించాం. 03 డిసెంబర్ 1971 రోజున భారత్‌పై పాకిస్థానీ ఏయిర్ ఫోర్స్ దాడులు జరపడంతో ఇండియా, పాకిస్థాన్‌లో మధ్య యుద్ధం ప్రారంభం అయ్యింది. దీనికి బదులుగా భారత త్రివిధ దళాలు, ముఖ్యంగా భారత నావికా దళం 04 డిసెంబర్ 1971న నిర్వహించిన "ఆపరేషన్ ట్రిడెంట్" జవాబుతో కరాచీ పోర్ట్ నామరూపాలు లేకుండా పోవడంతో పాకిస్థాన్ బిత్తరపోవడం, భారత్ తన ప్రతాపాన్ని పాక్‌కు రుచి చూపడం గత ఘన చరిత్రగా నిలిచిపోయింది. 14 డిసెంబర్ 1971 రోజున ఈస్ట్ పాకిస్థాన్ గవర్నర్ ఇంటిపై భారత ఏయిర్ ఫోర్స్ దాడులు చేయడంతో ఖంగుతిన్న పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి బంగ్లాదేశ్ ఏర్పడడానికి అంగీకరించడం, 16 డిసెంబర్‌న పాకిస్థానీ జనరల్ ఏ ఏ కె నాజియా నేతృత్వంలో 93,000 పాకిస్థానీ సైన్యం లొంగి పోవడంతో, పాకిస్థానీ కంబంధహస్తాల నుంచి బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్ స్వేచ్ఛను పొందిన ఫలితంగా మరో కొత్త దేశంగా బంగ్లాదేశ్ ఆవిర్భవించడం జరిగిపోయింది. భారత జనరల్ సామ్ మనేక్‌షా నేతృత్వంలో సాధించిన విజయంలో పాటు 3,000 మంది వరకు భారత సైనికులు ప్రాణాలు కోల్పోవడం, 9,851 మంది వరకు గాయపడడం విచారకరం. పాకిస్థాన్ సైన్యంలో 8,000లకు పైగా మరణాలు, 25,000ల వరకు సైనికులు గాయపడడం జరిగింది. తొమ్మిది నెలలుగా జరిగిన ఈస్ట్, వెస్ట్ పాకిస్థాన్ పోరాటంలో పాకిస్థానీ అనుకూల, వ్యతిరేక దళాల మధ్య జరిగిన పోరులో 3 లక్షల నుంచి 3 మిలియన్ల వరకు సాధారణ ప్రజలు/సైనికులు మరణించడం, అనేక మంది మహిళలు మానభంగం చేయబడడం లాంటి అమానవీయ ఘటనలు చోటు చేసుకోవడం వెస్ట్ పాకిస్థానీ ప్రభుత్వ పెద్దల ఫలితమే అని అర్థం చేసుకోవాలి. భారత త్రివిధ దళాలు అర్జించి పెట్టిన ఈ ఘన విజయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏట 16 డిసెంబర్ రోజున "విజయ్ దివస్" నిర్వహించుకోవడం, ప్రాణత్యాగం చేసిన సైనికులకు నివాళులు అర్పించడం, గాయపడిన సైనికులకు చేయూతను అందించడం జరుగుతున్నది.

# ధనుర్మాసమంటే శూన్య మాసమా? శుభకార్యాలు చేయకూడదా?

**ధనుర్మాసంలో శుభకార్యాలు ఎందుకు చేయరో తెలుసా?**

**అగ్నిధార న్యూస్ హైదరాబాద్ :** కార్తీక మాసం, మాఘమాసం, శ్రావణ మాసాలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యత ఉందని చాలా మంది భావిస్తారు. కానీ ధనుర్మాసం కూడా చాలా ఆధ్యాత్మిక ప్రయోజనాలు కలిగిన నెల. ఈ నెలకు చాలా ప్రత్యేకత ఉంది. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించాక ఏర్పడే ధనుర్మాసం ఎంతో విశిష్టమైనది. ఈ కథనంలో ధనుర్మాసానికి ఎందుకంతటి విశిష్ట వచ్చింది? ఈ మాసంలో శుభకార్యాలు చేయవచ్చా? ఈ మాసానికి శూన్య మాసమని ఎందుకు పేరు వచ్చింది? తదితర వివరాలను తెలుసుకుందాం.

### ధనుర్మాసం అంటే?

డిసెంబర్ 15వ తేదీ ఆదివారం సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశిస్తాడు కాబట్టి డిసెంబర్ 16వ తేదీ నుంచి ధనుర్మాసం మొదలవుతుంది. ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం ఇల్లు శుభ్రం చేసి, దీపారాధన చేయడం వల్ల మహాలక్ష్మి కరుణా, కటాక్షాలు సిద్ధిస్తాయని శాస్త్రవచనం. తెలుగు రాష్ట్రాలలో ఈ మాసాన్ని పండుగ నెల అని అంటారు.

### విష్ణు పూజ – బాలభోగం

ధనుర్మాసం విష్ణు పూజకు చాలా ప్రత్యేకమైనది. తిరుమలలో ధనుర్మాసం నెలరోజులు సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. విష్ణు ఆలయాలలో ఉదయం అర్చనలు చేసి నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. ఇలా చేయడాన్ని బాలభోగం అంటారు. అలాగే ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ ముహూర్తం లాంటిది. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే వరకు అంటే భోగి రోజు వరకు ధనుర్మాసం కొనసాగుతుంది. ఈ నెల రోజులు విష్ణు ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ధనుర్మాసంలో స్నాన, దాన, హెూమ, వ్రత పూజలు చేయడం చాలా మంచిది.

### ధనుర్మాసానికి ఎందుకంత విశిష్టత?

దేవాలయాల్లో జరిగే ఆగమ శాస్త్ర కైంకర్యాలలో స్థానిక ఆచార వ్యవహారాలు, ఇతర సంప్రదాయాలు కలిసిన అంశాలలో ధనుర్మాసం ఒకటి. నిజానికి ఆండాళ్ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కళ్యాణం మొదలైనవి ద్రావిడ దేశ సంప్రదాయమని పెద్దలు తెలియజేశారు. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసమని అర్థం. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. దేవాలయాల్లో ఆండాళమ్మ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కళ్యాణం, పొంగల్ ప్రసాదాలు మొదలైనవి ధనుర్మాసంలోనే నిర్వహిస్తారు.

### దారిద్ర్యాన్ని దూరం చేసే లక్ష్మీ పూజ

ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతో దరిద్రం దూరమవుతుందని విశ్వాసం.

### ముగ్గులు – గొబ్బెమ్మలు

ధనుర్మాసంలో ప్రతి ఇంటి ముందు వేకువఝామున ఇంటి ముందు అందమైన ముగ్గులు వేసి ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలు, గుమ్మడి పూలు ఉంచి వాటిని బియ్యం పిండి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజిస్తారు. లక్ష్మీ రూపంలో ఉన్న గొబ్బెమ్మలను పూజించడం వల్ల మంచి జరుగుతుంది.

### ధనుర్మాస వ్రతం – మార్గళి

ధనుర్మాస వ్రతం గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతం గురించి బ్రహ్మాండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి. ఈ ధనుర్మాసంలోనే గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది.

### కల్యాణ ప్రాప్తి

ధనుర్మాసంలో వివాహం కావాల్సిన అమ్మాయిలు ప్రతిరోజు సూర్యోదయానికి ముందే స్నానాలు చేసి పంచామృతాలతో మహావిష్ణువును అభిషేకించి, తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర సహస్రనామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పించాలి. నెలరోజులూ చేయలేని వాళ్ళు 15 రోజులు, 8 రోజులు లేదా ఒక్క రోజైనా చేయవచ్చు. ఇలా చేయడం వలన వారికి కోరుకున్న వ్యక్తితో అతి త్వరలో వివాహం జరుగుతుందని ప్రతీతి. ధనుర్మాసంలో శుభకార్యాలు ఎందుకు చేయరు? ఏడాది పొడవునా నిత్య దైనందిన కార్యక్రమాలతో ఉంటూ భగవంతుని కోసం సమయం కేటాయించలేని వారి కోసమే ఈ ధనుర్మాసం.



అందుకే ఈ నెలలో ఎలాంటి శుభకార్యాలు చేయరు. శుభకార్యాలు ఉండవు కాబట్టి ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. ఎందుకంటే రవి ధనస్సు రాశిలోకి ప్రవేశించి మకరంలోకి వెళ్ళే సమయమే ధనుర్మాసం. ధనుస్సు, మీనంలో రవి ఉన్నప్పుడు, సూర్యుని రాశి అయిన బృహస్పతిలో ఉన్నప్పుడు ఏ శుభకార్యాన్ని నిర్వహించకూడదు. కేవలం పండుగ వాతావరణంతో అంతా సంతోషంగా, ప్రశాంతంగా ఉండగలుగుతారు. ఈ మాసంలో ఎక్కువగా సూర్య నమస్కారాలు చేస్తారు. ఇంకా విష్ణుమూర్తిని నిత్యం వేకువనే పూజించడం శుభం. ఇంతటి విశిష్టమైన ధనుర్మాసాన్ని విష్ణు పూజకు వినియోగించి సద్వినియోగం చేసుకుందాం. జై శ్రీమన్నారాయణ! సీనియర్ జర్నలిస్ట్ వెంకయోగి రఘురామ్.

# ఎక్సలెన్స్ అవార్డు రావడం సంతోషకరం

**పాఠశాల చైర్మన్ సంజీవ్ కుమార్**

**సుల్తానాబాద్,డిసెంబర్ 15 ():** స్కూల్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించడం ఎంతో సంతోషకరమైన విషయమని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్ లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎట్ టేక్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు' కార్యక్రమంలో సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. సోమవారం పాఠశాల వేదికగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ లకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అందించాలనే లక్ష్యంతో పాఠశాల ముందుకు సాగుతోందని తెలిపారు. ఉపాధ్యాయుల అంకితభావం, ప్రిన్సిపల్ కృష్ణప్రియ నాయకత్వం,విద్యార్థుల కృషి ఫలితంగానే ఈ అవార్డు లభించిందన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన విద్యా ప్రమాణాలు నెలకొల్పి, జాతీయ స్థాయిలో



గుర్తింపు సాధించే దిశగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డు పాఠశాల సిబ్బందికి, విద్యార్థులకు మరింత ఉత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాలెట్స్ ను ఆర్వోలు తనిఖీ చేయాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఈనెల 17వ తేదీన పానుగల్, శ్రీరంగాపూర్, విపనగండ్ల, పెబ్బేరు, చిన్నంబావి మండలాల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ పాన్గల్, శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలాల్లో పర్యటించారు. పానగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య ఆర్వో లతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసేటప్పుడు బ్యాలెట్ పేపర్లను ఆర్వోలు తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులు అన్ని ఉన్నాయో లేదో చెక్ చేసిన తర్వాతే సిబ్బందికి పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ బయట అతికించే ఫారం 9 వివరాలు సక్రమంగా రాసి అతికించాలన్నారు. ఈ రెండు విషయాల్లో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఏమైనా పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాగ్రత్తగా పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులని అడిగి నివృత్తి చేసుకోవాలని, అంతేగాని పొరపాట్లకు మాత్రం తావు ఇవ్వొద్దని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో అభ్యర్థిని లేదా వారి ఏజెంట్లు మాత్రమే అనుమతించాలని, వారితో ఎలాంటి మొబైల్ ఫోన్ ను అనుమతించడానికి వీల్లేదని తెలియజేశారు.

### పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ స్థలాల పరిశీలన

పానగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్



కళాశాల, శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని సర్వవర్గ కమ్యూనిటీ హాల్, పెబ్బేరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణల్లో మంగళవారం పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కొరకు చేయనున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి గందరగోళం లేకుండా పోలింగ్ సామాగ్రి పంపిణీకి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బృందాలు, గ్రామ పంచాయతీల వివరాలతో రూట్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిబ్బంది సంఖ్యకు అనుగుణంగా టెంట్లు, భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఒంటిగంట కల్లా సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు బయలు దేరి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. మూడో విడతలో పోలింగ్ జరగనున్న ఐదు మండలాల్లో డిసెంబర్ 15వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ఎలాంటి ప్రచారం కానీ, ఓటర్ స్లిప్పుల పంపిణీ కానీ చేయడం జరగవద్దన్నారు. ఈ రెండు రోజుల్లో మద్యం, ధన ప్రభావం కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పరిశీలన

పానగల్, శ్రీరంగాపూర్, పెబ్బేర్ మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ పూర్తిగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారం 14 దరఖాస్తు చేసుకున్న వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని సూచించారు. ఎన్నికల విధుల అపాయింట్మెంట్ ఆర్డర్ కాపీ, (వోటర్ ఐడీ) లేదా మరో గుర్తింపు కార్డు జిరాక్స్ తనిఖీ చేయాలన్నారు. ఓటు వేసిన వారిని ఓటర్ లిస్ట్‌లో నమోదు చేయాలని సూచించారు ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఆయా మండలాల తహసిల్దార్లు, ఎంపీడీఓ లు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## నూతన ప్రజాప్రతినిధులను సన్మానం



**అగ్నిధార న్యూస్, కమాన్ పూర్:** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నాయకత్వంలో టిఆర్ఎస్ పార్టీ బలపరిచి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన పెంచికల్ పేట్ సర్పంచ్ పల్లె మాధవి – నారాయణ లతో పాటు, పెంచికల్ పేట్ గ్రామ వార్డు సభ్యులను, అలాగే పేరపల్లి గ్రామ ఉప సర్పంచ్ ఎరుకల పల్లవి తో పాటు వార్డు సభ్యులను, సిద్ధిపల్లె వార్డు సభ్యులను బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ సోమవారం వారిని మర్యాద పూర్వకంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో టిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్గాంలో... పల్లెల నూతన సారధులు

**15 మంది సర్పంచ్‌ల విజయం**

**బీ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ**



**అగ్ని ధార న్యూస్, (అంతర్గాం):** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు వెలువడగా, అంతర్గాం మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు నూతన సారథులు ఎన్నికయ్యారు. యువకులు, మహిళలు, సీనియర్ నాయకులు గ్రామ పంచాయతీల పగ్గాలు చేపట్టడానికి సిద్ధమయ్యారు. విజేతలకు ఆయా గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించి, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటామని నూతన సర్పంచ్‌లు ఈ సందర్భంగా ప్రకటించారు. నూతన సర్పంచులు తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి ఆశలు చిగురించాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దేవి చెరువులో చేపలు వదలిన కాంగ్రెస్ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో దేవి చెరువులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ రాజేశ్వరి రవి గౌడ్, ఉప సర్పంచ్ ఎముక రవి,అధ్యక్షతన దేవి చెరువు లో 17730 చేప పిల్లలు వదిలారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తాడెం జంగయ్య. ఉపాధ్యక్షులు యర సురేష్. గ్రామ వార్డు మెంబర్లు. నాగమణి మహేందర్.మౌనిక మల్లయ్య, చెన్నమ్మ జంగయ్య. కురుమ సంఘం అధ్యక్షులు చిక్కొండ బీరయ్య. నాయకులు నాప ఎల్లయ్య,చిక్కండం మల్లయ్య. చిక్కొండ శ్రీశైలం. యువ నాయకుడు పెరుమళ్ళ శ్రీశైలం. ముదిరాజు సంఘం సభ్యులు. యారా పరశు రాములు. సైదులు తదితరులు పాల్గొన్నారు

## దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి నీ సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండ పల్లి మండలంలోని పడకల్ గ్రామ సర్పంచిగా గెలుపొందిన డోకూరి ప్రభాకర్ రెడ్డి నీ వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు.

## చెదురువల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ కి సన్మానం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామ గౌడ సంఘం కమిటీ తరపున నూతనంగా ఎన్నికైన వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ను వెల్దండ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో సన్మానించడం జరిగింది. చెదురుపల్లి సర్పంచ్ దన్ సింగ్ మరియు మరియు ఉప సర్పంచ్ సహదేవ్ నగర గడ్డ తండా సర్పంచ్ శారద సాయనాయక్ బొల్లంపల్లి సర్పంచ్ ప్రసాద్ గార్లను వేరువేరుగా సన్మానించారు ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య గౌడ్ తిరుపతయ్య గౌడ్ లింగమయ్య గౌడ్ యాదయ్యగౌడ్ శ్రీరాములు గౌడ్ మహేష్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు

## విజయం సాధించిన సర్పంచులందరికి అభినందనలు

**వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి.**

**వనపర్తి :** ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీ సాధించింది.ఓం మేఘారెడ్డి.ఆదివారం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన సర్పంచులకు, వార్డు సభ్యులకు, ఉపసర్పంచ్ లకు అందరికీ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అభినందనలు. తెలియజేశారు.పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇద్దరు బరిలో ఉండడంతో ఇతరులకు అవకాశం వచ్చిన ఆ గ్రామాల్లో ఆ ఇద్దరు వ్యక్తుల ఓట్లు గెలిచిన వ్యక్తి కంటే కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ పోలయ్యాయి.అంటే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కే అధికంగా బలం ఉంది అని నిరూపణ అయింది.కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు సీనియర్ నాయకుల ప్రోత్సాహంతో పలు గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు బరిలో నిలవడంతో ఫలితాలు కొద్దిగా తగ్గిన పల్లెల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారు.ఎన్నికలు జరిగిన ఆరు మండలాలలో ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీలో విజయ్ కేతనం ఎగరవేసింది అన్నారు.

## కొలిమిగుండ్లలో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు..

**కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు ఎంపీడీవో దస్తగిరి బాబు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 53వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో దస్తగిరి బాబు, కోటపాడు శివరామిరెడ్డి, కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు అమర్రహే అని వారు నినాదాలు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం కారణంగానే మనకు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేయడంతోనే 1953 అక్టోబర్ 1న కేంద్ర ప్రభుత్వం స్పందించి మద్రాస్ ప్రభుత్వం నుండి ఆంధ్రప్రదేశ్ ను ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించి ప్రకటన చేశారని ఆయన సేవలు త్యాగాల గురించి టిడిపి సీనియర్ నాయకుడు కోటపాడు శివరామిరెడ్డి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దస్తగిరి బాబు, కొలిమిగుండ్ల తహసిల్దార్ శ్రీనివాసులు, చంద్రమౌళీశ్వర గౌడ్, ఎంఈఓ అబ్దుల్ కలాం, అన్వర్ భాష, కోటపాడు శివరామిరెడ్డి, చిన్నపరెడ్డి, డిష్ గోపాల్, నాగార్జున రెడ్డి, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి పనితీరుకు పంచాయతీ ఫలితాలే నిదర్శనం

**మహబూబ్ నగర్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చిన్నంబావిలో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమైందని, ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజల సంతోషమే లక్ష్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన హామీల్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అతి త్వరలోనే అమలు చేస్తుందన్నారు. చాలాచోట్ల ఇంకా పనులు మొదలుపెట్టాల్సి ఉందన్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, సమర్థతతో పార్టీపై, ప్రభుత్వంపై ప్రజల్లో గట్టి నమ్మకం, విశ్వాసం ఏర్పడిందనడానికి ఈ పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శమని జూపల్లి పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన మొదటి, రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలో 50 చోట్ల (3 స్వతంత్రులను కలిపి) అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలవగా, 28 స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు తెలిపిన అభ్యర్థులు గెలుపొందారని చెప్పారు. రెండు సంవత్సరాలలో చేసిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలు కార్యరూపం దాల్చుతున్నాయని, కొన్ని పనులు ఇంకా ప్రారంభదశలో ఉన్నాయని తెలిపారు. చిన్నంబావికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశాం. పనులకు టెండర్లు ఆహ్వానించాం. ఆర్ అండ్ బీకి రూ.200 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.100 కోట్లతో పనులు చేపడుతున్నాం. వాటి నుంచి చిన్నంబావి మండలం అభివృద్ధి పనులకు కేటాయించాం. ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభ దశలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మీద నమ్మకంతో ప్రజలు మేం మద్దతు తెలిపిన అభ్యర్థులు మూడింట రెండు వంతులు గెలుపొందుతూ ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారుకొల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించి పాత 4 మండలాలు కోడేరు, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లిలో 78 సర్పంచ్ స్థానాలుండగా 47 కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసినా 28 స్థానాలు నెగ్గాయి. ముగ్గురు కాంగ్రెస్ నేతలు ఛాన్స్ రాలేదని సొంతంగా పోటీచేసి విజయం సాధించారు. విత్ డ్రా చేసుకోకుండా బరిలోకి దిగి మా పార్టీ వాళ్లే నెగ్గడంతో మొత్తం 50 స్థానాలు మేం నెగ్గాం. కాంగ్రెస్ సింగిల్ గా పోటీ చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. రెండేళ్ల పాలనకు ప్రజలు ఓటు వేసి సర్పంచులుగా గెలిపించడంపై హర్షం వ్యక్తం చేశారు. మిగతా 3 ఏళ్లలో మరిన్ని అభివృద్ధి పథకాలు అమలు చేయడంతో పాటు మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. ముగ్గురిలో ఇద్దరు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటే, మిగతా ఒక్కరు బీజేపీ, బీఆర్ఎస్ లకు ఓట్లు వేశారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## ఈనెల 20న అయ్యప్ప స్వామి తెప్పోత్సవం

**కరీంనగర్ :** డి. సంపత్ తెప్పోత్సవ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి తెప్పోత్సవ కార్యక్రమం ఈ ఏడాది కూడా ఈనెల 20న ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. తెప్పోత్సవ దినాన మధ్యాహ్నం 1 గంటలకు అయ్యప్ప స్వాములకు మరియు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రాత్రి 9:15 గంటలకు భక్తులకు అల్పాహారం అందించనున్నట్లు వెల్లడించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ చైర్మన్ డి. సంపత్ పిలుపునిచ్చారు. ఈ తెప్పోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా సాయంత్రం 7:15 గంటలకు గోమాతతో కలిసి అయ్యప్ప స్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గోమాతకు అయ్యప్ప స్వాములు మహిళలు కలిసి మహారతి ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భక్తుల్లో విశేష ఉత్సాహాన్ని నింపుతుందని నిర్వాహకులు తెలిపారు.

## తప్పుల తడకగా డివిజన్ల పునర్విభజన

**సికింద్రాబాద్ :** డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉన్నదని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో తలసాని సనత్ నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో డీ లిమిటేషన్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిదులను కానీ సంప్రదించకుండా ఆఫీస్ లో కూర్చొని ల్యాప్ టాప్ పెట్టుకొని గూగుల్ మ్యాప్ ద్వారా డీ లిమిటేషన్ చేసారని తెలిపారు. కనీస పరిజ్ఞానం లేకుండా సమస్యల తడకగా పునర్విభజన జరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే గందరగోళంలో ఉందని, పరిపాలన చేయమంటే ముఖ్యమంత్రి పోయి ఫుట్బాల్ ఆడుతున్నాడని హేళన చేశారు.

## క్రిస్మస్ వేడుకలకు హాజరయిన ఎమ్మెల్యే

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం నియోజకవర్గ పరిధిలోని వార్డు 6 కాంటా బస్తీ లోని పుదు వాల్వు చర్చ్, వార్డు 2 రసూల్ పుర లోని హెవెన్ ప్యాలెస్ లలో నిర్వహించిన క్రిస్మస్ సెలబ్రేషన్స్ కు నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు . అనంతరం వేడుకలను ఉద్దేశించి ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించి ప్రజలందరూ సేవ, త్యాగం, క్షమ, ప్రేమల గుణాలను కలిగి శాంతి, సౌభ్రాతృత్వలతో నడవాలని అన్నారు.ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించిన పాస్టర్ లను, నిర్వాహకులను ఎమ్మెల్యే గారు అభినందించి అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లను అభినందించిన రామగుండం ఎమ్మెల్యే

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం నియోజకవర్గంలో రెండో దశలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పాలకుర్తి,అంతర్గాం మండలాలకు చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,వార్డు సభ్యులను నియోజకవర్గం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అభినందించారు.సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి శాలువా కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ లుగా గెలుపొందిన గ్రామాల అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.గ్రామాల అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని,గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు.

## సింగరేణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ డిమాండ్**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** సింగరేణిలో పేరుకుపోయిన కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఐఎన్టియుసి శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా సింగరేణి యాజమాన్యం కార్మికులపై అవలంబిస్తున్న మొండి వైఖరిని తీవ్రంగా ఖండించారు. మెడికల్ బోర్డు జాప్యం, 150 మస్టర్ల సర్క్యులర్, ట్రాన్స్ఫర్ పాలసీ వంటి నిర్ణయాలు కార్మికులకు నష్టం కలిగిస్తున్నాయని పేర్కొంటూ, వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయితీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సింగరేణి సిబ్బందికి ఓడి మంజూరు చేయాలని కోరారు. కార్మిక హక్కుల రక్షణకు ఐ ఎన్ టి యు సి ఉద్యమపథాన్ని అనుసరిస్తుందని స్పష్టం చేసిన ఆయన, రాబోయే యూనియన్ ఎన్నికల్లో ఐ ఎన్ టి యు సి విజయానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐ యన్ టి టియుసి నాయకులు కాంపెల్లి సమ్మయ్య, శ్యామ్, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి మంచిర్యాల అభివృద్ధికి రూ.4,000 కోట్ల ప్రాజెక్టులు

**సెమీకండక్టర్ ఫెసిలిటీపై కేంద్రానికి ఎంపీ వినతి**

**అగ్నిధార న్యూస్ ,(న్యూఢిల్లీ):** పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల అభివృద్ధికి సంబంధించిన సుమారు రూ.4,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల పురోగతిపై ఎంపీ పార్లమెంట్‌లో కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను అడిగారు. ఈ ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులపై పూర్తి వివరాలతో సమాధానం ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణకు రావాల్సిన సెమీకండక్టర్ ఫెసిలిటీ రాజకీయ కారణాలతో ఆంధ్రప్రదేశ్‌కు తరలించడంపై ఎంపీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ప్రాజెక్టు తెలంగాణకు వచ్చి ఉంటే వేలాది యువతకు ఉపాధి అవకాశాలు లభించేవని పేర్కొన్నారు. దీనిపై స్పష్టమైన ప్రపోజల్ సమర్పించాలని కేంద్రం సూచించగా, అన్ని అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం ఎంపీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను వ్యక్తిగతంగా కలిసి, పెద్దపల్లి మంచిర్యాల ప్రాంతంలో ఉన్న సమృద్ధమైన నీటి వనరులు, భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన యువత ప్రతిభను వివరించారు. రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్, సింగరేణి సంస్థల విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, ఈ ప్రాంతం పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూలమని తెలిపారు. సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు జరిగితే రాష్ట్ర అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు గణనీయమైన లాభం చేకూరుతుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పన్నూర్ నూతన సర్పంచ్ మహేశ్‌కు ఘన సన్మానం

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 11న జరిగిన తొలి విడత ఎన్నికల్లో రామగిరి మండలం పన్నూర్ గ్రామ సర్పంచ్‌గా సిపిఐ బలపరిచిన మహేశ్ ఎన్నికైన సందర్భంగా సిపిఐ, ఏఐటియుసి నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం సెంటినరీ కాలనీలోని కే.ఎల్. మహేంద్ర భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిపిఐ రామగిరి మండల కార్యదర్శి జూపాక రాంచందర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్జీ 3 బ్రాంచి కార్యదర్శి మందల రాంచంద్రారెడ్డి తదితరులు నూతన సర్పంచ్ మహేశ్‌కు పూలబోకె అందించి శాలువా కప్పి సన్మానించారు.నాయకులు మాట్లాడుతూ పన్నూర్ గ్రామ ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేలా సిపిఐ పార్టీ పూర్తిస్థాయి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు డి.టి. రావు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో మనాలి ఠాకూర్ ప్రత్యేక పూజలు

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం నియోజకవర్గం గోదావరిఖని పవర్ హౌస్ కాలనీలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర శివాలయ దేవాలయాన్ని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ సోమవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు, శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించారు. ఆలయ పూజారులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బెందీ ఏర్పాట్లు చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి :** 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమ వారం ఐడిఓసి కార్యాలయం నుండి 3వ విడత గ్రామ పంచా యతి ఎన్నికలు జరుగనున్న కాటారం, మల్హార్, మహదే వపూర్, మహా ముత్తారం మండలాల రెవెన్యూ, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ విడత నిర్వహణలో భాగంగా 16న పోలింగ్ మెటీరియల్ పంపిణీ, 17వ తేదీన పోలింగ్, 2 గంటల తదుపరి ఓట్లు లెక్కింపు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. మొదటి, రెండవ విడతల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించా రని భాగస్వాములైన అధికారులను, సిబ్బందిని అభినందిం చారు. అదే స్ఫూర్తితో 3వ విడత జరుగనున్న ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విధులు కేటాయించిన సిబ్బంది 16వ తేది ఉదయం 10 గంటల వరకు మెటీరియల్ పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తదుపరి పరిశీలన అనంతరం కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 17వ తేదీన జరుగనున్న పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. 17వ తేదీన ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాలని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, తదుపరి మధ్యాహ్నం 2గంటల నుండి ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యతకు వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మండల పర్యవేక్షణ అధికారులు పోలింగ్ సరళిని పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఓటర్లు అధికంగా పోలింగ్ కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు.క్రిటికల్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం

**ఆర్థిక సహాయం అందజేసిన సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల కేంద్రానికి చెందిన బద్క మల్లేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు.కుటుంబానికి సానుభూతి తెలుపుతూ అన్ని విధాలుగా అండగా ఉంటాం అని 5 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో,ఉప సర్పంచ్ బస్నముని శీను, 6వ వార్డు సభ్యులు మారేపల్లి శీను, 2వ వార్డు రంగనాథం, రషీద్, కొయ్యల పుల్లయ్య, బడక రామకృష్ణ, బడక బీరయ్య, రేవల్లి రాజు, భరత్ గౌడ్, బాబా, సమీర్, పాల్గొనడం జరిగింది

## పేదోడికి జైలు కోట్ల దోపిడీదారులకు ఊర్లో స్వేచ్ఛేనా?

**8.50 కోట్ల ఎఫ్‌సీఐ బియ్యం దోపిడీపై ప్రభుత్వంపై ఊట్ల శ్రీను విమర్శ**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):** పేదవాడు ఆకలి కోసం చిన్న తప్పు చేస్తే జైలుకే పంపించే ప్రభుత్వం, కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని దోచుకున్న ధనవంతులను మాత్రం చట్టానికి అతీతులుగా చూస్తుందా? ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా ప్రజా పాలన? అంటూ మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను ప్రభుత్వ వ్యవస్థపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఆయన, మంథని మండలం కూచ్రాజుపల్లి గ్రామ శివారులోని శ్రీ వెంకట సాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకి చెందిన సిఎంఆర్ బియ్యాన్ని ఉద్దేశపూర్వకంగా దోపిడీ చేసిన భారీ అవినీతి వ్యవహారాన్ని అధికారుల ముందు ఉంచారు. శ్రీ వెంకట సాయి ఇండస్ట్రీస్ యజమానులైన చెల్కల అశోక్ కుమార్, బోడ సంపత్ రెడ్డి, చెల్కల స్వర్ణలత, బోడ సరోజనలు కలిసి పేద ప్రజలకు చెందాల్సిన బియ్యాన్ని సుమారు రూ.8 కోట్ల 50 లక్షలు (అక్షరాల ఎనిమిది కోట్ల యాభై లక్షలు) పైచిలుకు అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. ఇంత భారీ దోపిడీ బయటపడినా ఇప్పటివరకు ఒక్కరిపై కూడా కఠిన చర్యలు తీసుకోకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. “పేదోడు బియ్యం సంచి మోస్తే కేసు కోట్ల బియ్యం మింగితే పదవులు, పలుకుబడి. ఇది చట్టమా? లేక ధనికులకు మాత్రమే వర్తించే ప్రత్యేక న్యాయమా?” అంటూ ఊట్ల శ్రీను అధికారులను ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎంత మొత్తం రికవరీ చేశారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా కలెక్టర్, దోపిడీ ఆరోపణలపై తక్షణ విచారణ చేపట్టి, సంబంధిత శాఖల ద్వారా చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఊట్ల శ్రీను తెలిపారు.

## అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ రోడ్ల సమస్యలపై ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు వినతి

**కొత్త టెండర్లలో పనులు పూర్తి చేస్తామని హామీ**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం మున్సిపల్ ఇన్‌చార్జ్ కలెక్టర్ అరుణశ్రీను సోమవారం 32వ డివిజన్ అంబేద్కర్ కాలనీవాసులు కలిసి కాలనీలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వేస్తామని రోడ్డు త్రవ్వి వదిలేయడంతో నాలుగు సంవత్సరాలుగా పనులు పూర్తి కాకపోవడం, మరోచోట డ్రైనేజీ పైపులు వేసి మట్టి మాత్రమే కుడిపి రోడ్డు వేయకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాలను ఇన్‌చార్జ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ అరుణశ్రీ మేడం, రాబోయే కొత్త టెండర్లలో అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీలు, రోడ్ల పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలపై స్పందించినందుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పెగడపల్లి నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవల్లి లక్ష్మణ్, పెగడపల్లి సంతోష్, మేకల శేఖర్, పెగడపల్లి ఉమా మహేష్, చింతల భగవాన్ దాస్, కుతడి పూలమ్మ, పేరుక వెంకటస్వామి, పెగడపల్లి రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

## ఖని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి సన్మానం

**అగ్నిధార న్యూస్,( రామగుండం)** నూతనంగా ఎన్నికైన గోదావరిఖని ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను సీనియర్ జర్నలిస్టు,బిజెపి ఎస్ సి మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఘనంగా సత్కరించారు.సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గానికి శాలువా కప్పి సన్మానించారు.అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్. కుమార్ మాట్లాడుతూ మీడియా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని,ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు.గోదావరిఖని ప్రాంత అభివృద్ధి,ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రెస్ క్లబ్ మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు మాధవరావు,గడ్డం శ్యామ్ కుమార్ సీనియర్ సభ్యులు మాదాసు రామ్మూర్తి,పందిళ్ళశ్యామ్,కోశాధికారి తాడబోయిన రాజ్ కుమార్,ఉపాధ్యక్షులు జీవన్ బాబు,కె.ఎస్.వాసు,తగరపు శంకర్,ఇజ్జగిరి సమ్మయ్య,సంయుక్త కార్యదర్శి మామిడి అశోక్,బిక్షపతి,కార్యవర్గ సభ్యులు దయానంద్ గాంధీ,కోలేటి భాస్కర్, పెనుగొండ సతీష్,బొల్లం మధుబాబు,దబ్బేట శంకర్,సుధీర్ బాబు,కోదాది కుమార్,పి.కిశోర్ యాదవ్,మాటేటి శ్రీనివాస్,వడ్డెపల్లి దినేష్,తిరుపతి,వరుణ్,శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి నియోజకవర్గం నుండి గెలుపొందిన భారత రాష్ట్ర సమితి సర్పంచులకు వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గం ఉప్పల వెంకటేష్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో బీ ఆర్ఎస్ పార్టీ సర్పంచులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# బిజినెస్

## ఎస్‌బిఐ రుణాలు చౌక




దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రేపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన నేపథ్యంలో ఎస్‌బిఐ వడ్డీ రేట్లకు కోత విధించింది. అన్నిరకాల రుణాలపై వడ్డీరేటును పావు శాతం తగ్గిస్తున్నట్టు ఎస్‌బిఐ ప్రకటించింది. ఎస్‌బిఐ తీసుకున్న తాజా నిర్ణయంతో ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ రేటు (ఇబిఎల్‌ఆర్) 25 బేసిస్ పాయింట్లు కోత పెట్టనుండటంతో రుణాలపై వడ్డీరేటు 7.90 శాతానికి దిగిరానుంది. ప్రయివేటు బ్యాంక్‌లతో పోల్చితే వేగంగా తమ ఖాతాదారులకు ఈ ప్రయోజనాలను బదిలీ చేయడం విశేషం. తగ్గించిన వడ్డీరేట్లు డిసెంబర్ 15 నుంచి అమలులోకి రానున్నట్టు ఎస్‌బిఐ తెలిపింది. అదే విధంగా బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసిఎల్‌ఆర్)ని కూడా 5 బేసిస్ పాయింట్లు కోత విధించింది. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసిఎల్‌ఆర్ 8.75 శాతం నుంచి 8.70 శాతానికి దిగిరానుంది. ఎస్‌బిఐ నిర్ణయంతో రుణ గ్రహీతలపై ఇఎంఐ చెల్లింపుల భారం కొంత తగ్గనుంది. మరోవైపు 2–3 ఏళ్ల కాలపరిమితి కలిగిన ఫిక్సుడ్ డిపాజిట్లపై వడ్డీ రేటును 5 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.40 శాతానికి పరిమితం చేయగా.. 444 రోజుల డిపాజిట్ రేటును 6.60 శాతం నుంచి 6.45 శాతానికి తగ్గించింది.

## సెయిల్ అమ్మకాల్లో 14 శాతం వృద్ధి



దిగ్గజ మహారత్న కంపెనీ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) మెరుగైన అమ్మకాలను నమోదు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో 14 శాతం వృద్ధితో 12.7 మిలియన్ టన్నుల (ఎంటి) విక్రయాలను సాధించింది. గతేడాది ఇదే కాలంలో 11.1 మిలియన్ టన్నుల అమ్మకాలు నమోదు చేసింది. ధరల ఒత్తిడి, డిమాండ్‌లో అనిశ్చితి ఉన్నప్పటికీ ఆకర్షణీయ అమ్మకాలు సాధించామని ప్రభుత్వ రంగ ఉక్కు దిగ్గజం శనివారం వెల్లడించింది. ''ప్రపంచ వ్యాప్తంగా ధరల ఒత్తిడి, వివిధ దేశాల వాణిజ్య విధానాల్లోని అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ఏర్పడిన డిమాండ్ హెచ్చుతగ్గుల వంటి అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ, పటిష్టమైన విక్రయ వ్యూహం కారణంగానే ఈ మెరుగైన ఫలితాలను సాధించగలిగాం" అని సెయిల్ తెలిపింది.గడిచిన ఎనిమిది నెలల కాలంలో రిటైల్ విక్రయాలు కూడా బలంగా ఉన్నాయి. 2024 ఏప్రిల్–నవంబర్‌లో 8.6 లక్షల టన్నులుగా ఉన్న రిటైల్ విక్రయాలు, ఈ ఏడాది 13 శాతం పెరిగి 9.7 లక్షల టన్నులకు చేరుకున్నాయి. దేశవ్యాప్తంగా చేపట్టిన బ్రాండ్ ప్రమోషన్ కార్యక్రమాలు ఇందుకు తోడ్పడ్డాయని ఆ సంస్థ పేర్కొంది. కేవలం నవంబర్ నెలలోనే మొత్తం విక్రయాలు గతేడాదితో పోలిస్తే 27 శాతం పెరగ్గా, రిటైల్ విక్రయాలు ఏకంగా 69 శాతం వృద్ధిని సాధించడం విశేషం. దేశంలోని జార?ండ్, చత్తీస్‌ఘడ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో ఐదు తయారీ ప్లాంట్ కలిగిన సెయిల్ ఏడాదికి 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది.

# రూ.10 వేలు దాటితే కట్టాల్సిందే




వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లించే వారికి అలర్ట్. మీరు చెల్లించాల్సిన మూడో విడత అడ్వాన్స్ ట్యాక్స్ గడువు డిసెంబర్ 15, 2025తో ముగుస్తోంది. మీరు ఇంకా చెల్లించనట్లయితే వెంటనే ఈ పని పూర్తి చేయండి.ట్యాక్స్ పేయర్లు తమ ట్యాక్స్ లయబిలిటీని ఓసారి పునఃసమీక్షించుకుని తాము చెల్లించే పన్ను రూ.10 వేలు దాటుతుంది అనుకుంటే కచ్చితంగా అడ్వాన్స్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. మూడో విడతలో 75 శాతం ట్యాక్స్ పూర్తి చేయాల్సి ఉంటుంది. లేదంటే పన్ను బకాయిలపై భారీగా పెనాల్టీలు, వడ్డీలు కట్టాల్సి వస్తుంది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. టీడీఎస్, టీసీఎస్ వంటి మినహాయింపులు తీసి వేసిన తర్వాత ఒక ఏడాదిలో చెల్లించాల్సిన పన్ను రూ.10,000 దాటిన వారందరూ తమ ట్యాక్స్ అడ్వాన్స్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం ఒకేసారి కాకుండా నాలుగు విడతల్లో చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. డిసెంబర్ 15వ తేదీ నాటికి 75 శాతం పన్ను కట్టి ఉండాలి. లేదంటే పెనాల్టీలు పడతాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 234సీ ప్రకారం పన్ను బకాయిలపై వడ్డీ నిర్ణయిస్తారు. ఇచ్చిన గడువులోపు కట్టని వారికి అడ్వాన్స్ ట్యాక్స్ బకాయిలపై నెలకు 1 శాతం వడ్డీ పడుతుంది. ఇది మూడు నెలలకు చెల్లించాల్సి వస్తుంది. గత మూడు విడతలతో పాటు వచ్చే మార్చి విడతకు సైతం 1 శాతం వడ్డీ అదనంగా చెల్లించాల్సి వస్తుంది. అంటే ఇక్కడ డబుల్ పెనాల్టీ కట్టాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.క్యాపిటల్ గెయిన్స్, లాటరీ, డివిడెండ్ ఇన్‌కమ్ అనేది ముందస్తుగా లెక్కించేందుకు కుదరదు కాబట్టి వాటిని అడ్వాన్స్ ట్యాక్స్ నుంచి మినహాయిస్తారు. అయితే, మార్చి 31 నాటికి మొత్తం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, సెక్షన్ 234సీ ప్రకారం అంచనా వేయలేని ఆదాయాలపై ఎలాంటి వడ్డీ ఉండదు. అలాంటి ఆదాయం వచ్చినప్పుడు తదుపరి విడతలో మొత్తం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అడ్వాన్స్ ట్యాక్స్ కేటగిరీలోని చలాన ×చీూ 280 ద్వారా ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు.. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ట్యాక్స్ పేయర్లు 90 శాతం పన్ను చెల్లించి ఉండకపోతే సెక్షన్ 234బీ అనేది అప్లై అవుతుంది. దీంతో ఏప్రిల్ 1 నుంచి అసెస్మెంట్ ఇయర్ మొత్తం నెలకు 1 శాతం చొప్పున వడ్డీ కట్టాల్సి వస్తుంది. ఉదాహరణకు ఆర్థిక సంవత్సరం 2025–26లో సెక్షన్ 234బీ కింద చెల్లించాల్సిన వడ్డీ అనేది ఏప్రిల్ 1, 2026 నుంచి అమలులోకి వస్తుంది. అలాగే బిజినెస్, వృత్తిపరమైన ఆదాయం లేని సీనియర్ సిటిజన్లకు అడ్వాన్స్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంటుంది. తమ ఆదాయంపై టీడీఎస్ సరిగ్గా మినహాయించారని ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

# భారీ నష్టాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు



ఈరోజు ఉదయం భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి, దీనితో మదుపరులలో కొంత ఆందోళన నెలకొంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతా లు రావడంతో ప్రధాన సూచీలు అయిన నిఫ్టీ మరియు సెన్సెక్స్ రెండూ కూడా ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిఫ్టీ సుమారు 131 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసి 25,915 కీలక మార్కు వద్ద ట్రేడ్ అవుతుండగా, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 398 పాయింట్లు కోల్పోయింది. ప్రస్తుతం సెన్సెక్స్ 84,869 పాయింట్ల వద్ద కొనసాగుతూ, మార్కెట్ సెంటిమెంట్ ప్రస్తుతానికి బలహీనంగా ఉందని స్పష్టం చేస్తోంది. మార్కెట్ పతనానికి ప్రధాన కారణం మార్కెట్ హెవీ వెయిట్స్ అని పిలవబడే దిగ్గజ కంపెనీల షేర్లలో వచ్చిన అమ్మకాల ఒత్తిడి అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇండెక్స్ మీద ఎక్కువ ప్రభావం చూపే టాటా స్టీల్, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ మరియు టైటాన్ వంటి బ్లూచిప్ షేర్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ రంగానికి చెందిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్‌బిఐ మరియు యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో చలిస్తున్నాయి. అలాగే ఐటీ దిగ్గజాలైన టిసిఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మరియు ఆటో రంగ షేర్ మారుతి కూడా డీలా పడటంతో మార్కెట్ మరింత దిగజారింది. స్టాక్ మార్కెట్ మొత్తం నష్టాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ఎంపిక చేసిన షేర్లు మాత్రం లాభాల బాట పట్టి ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చాయి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఏషియన్ పెయింట్స్ షేర్లు సానుకూల ధోరణిలో కదులుతూ లాభాలను నమోదు చేస్తున్నాయి. అలాగే డిఫెన్స్ మరియు మౌలిక వసతుల రంగానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మరియు ఎల్ అండ్ టి షేర్లు కూడా కొనుగోలు మద్దతును పొందుతున్నాయి. మార్కెట్ అమ్మకాల ఒత్తిడిలో ఉన్నప్పటికీ, ఈ కంపెనీల షేర్లు గ్రీన్ జోన్‌లో ట్రేడ్ అవుతుండటం గమనార్హం. మొత్తంగా చూస్తే, మార్కెట్ ఆరంభంలోనే బేర్స్ పట్టు బిగించడంతో బుల్స్ వెనకడుగు వేయాల్సి వచ్చింది. ట్రేడింగ్ సెషన్ ముగిసే సమయానికి సూచీలు కోలుకుంటాయా లేదా నష్టాలు మరింత పెరుగుతాయా అనేది వేచి చూడాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాబట్టి ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని, మార్కెట్ కదలికలను గమనిస్తూ జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## 'నంబర్ 3'లో ఇప్పటికే ఏడుగురు..

# సూర్య, తిలక్.. ఎవరు బెస్ట్?




టీ20 ప్రపంచకప్–2024 టైటిల్ గెలిచిన తర్వాత టీమిండియాలో చోటు చేసుకున్న ప్రధాన మార్పు.. దిగ్గజాలు రోహిత్ శర్మ– విరాట్ కోహ్లిలేని జట్టు. ఈ మెగా టోర్నీలో భారత్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత వీరిద్దరు అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

**హార్దిక్ పాండ్యాకు బదులు**

ఇక అప్పటి నుంచి జట్టు పునర్నిర్మాణంలో భాగంగా భిన్న పరిణామాలు చోటుచేసుకున్నాయి. హార్దిక్ పాండ్యాకు బదులు సూర్యకుమార్ యాదవ్‌కు బీసీసీఐ పగ్గాలు అప్పగించింది. అతడు సారథిగా విజయాలు సాధిస్తున్నా.. బ్యాటర్‌గా మాత్రం అప్పటి నుంచి విఫలమవుతూనే ఉన్నాడు. మరోవైపు.. బ్యాటింగ్ ఆర్డర్‌లో కీలకమైన మూడో స్థానంలో ఎవరిని ఆడించాలన్న విషయం ఇప్పటికీ స్పష్టత రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. టీ20 ఫార్మాట్లో మరో వరల్డ్‌కప్ టోర్నీకి సమయం ఆసన్నమవుతున్న వేళ.. టీమిండియాలో ఇంత వరకు ఈ కన్ఫ్యూజన్‌కు మాత్రం తెరపడటం లేదు.

**మూడో స్థానంలో**

ఒకప్పుడు మూడో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు వచ్చేవాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుని తిరిగి వచ్చిన తర్వాత కూడా సత్తా చాటి ప్రపంచకప్‌లో పాల్గొన్నాడు పంత్. అయితే, ఆ తర్వాత పంత్‌తో పాటు చాలా మంది సీనియర్లకు టెస్టుల్లో ప్రాధాన్యం ఇస్తూ టీ20 జట్టును యువ ఆటగాళ్లతో నింపేసింది యాజమాన్యం. అభిషేక్ శర్మకు తోడుగా.. సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపగా.. వీరు సక్సెస్‌ఫుల్ జోడీగా నిరూపించుకున్నారు. ఇక మూడో స్థానంలో యువ ఆటగాడు తిలక్ వర్మ.. కెప్టెన్ సూర్యతో పోటీపడ్డాడు. వన్‌డౌన్‌లో తాను సరైన వాడినేనని నిరూపించుకున్నాడు కూడా!

**పక్కనపెట్టేశారు**

అయితే, గత కొంతకాలంగా హెడ్‌కోచ్ గౌతం గంభీర్ బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రయోగాలతో విమర్శల పాలవుతున్న విషయం తెలిసిందే. గిల్ కోసం ఓపెనర్‌గా సంజూను తప్పించి.. మిడిలార్డర్‌లో ఓసారి, వన్‌డౌన్‌లో ఓసారి ఆడించారు. ఇప్పుడిక ఏకంగా వికెట్ కీపర్ కోటాలోనూ ఆడించకుండా పక్కనపెట్టేశారు. మరోవైపు.. కీపర్‌గా, ఫినిషర్‌గా జితేశ్ శర్మ రాణిస్తుండటంతో సంజూ ప్రపంచకప్ ఆశలు దాదాపు ఆవిరిఅయ్యినట్టే!

**ముచ్చటైన 'మూడు' కోసం ఇప్పటికే ఏడుగురు**

ఇక మూడో స్థానం విషయానికొస్తే.. 2024 వరల్డ్‌కప్ తర్వాత ఇప్పటి వరకు సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, శివం దూబే, అక్షర్ పటేల్.. ఇలా చాలా మంది ఆడారు. వీరిలో సూర్య 26.92 సగటుతో 157కు పైగా స్ట్రైక్‌రేటుతో 377 పరుగులు సాధించగా.. తిలక్ వర్మ 185కు పైగా స్ట్రైక్‌రేటుతో.. 161కి పైగా సగటుతో ఏకంగా 323 పరుగులు సాధించాడు. మిగిలిన వారిలో రుతురాజ్, సంజూ, అభిషేక్, శివం, అక్షర్.. ప్రయోగాత్మకంగా వచ్చి వరుసగా 84, 58, 24, 24, 21 పరుగులు చేశారు. అయితే, ఇటీవల సౌతాఫ్రికాతో సిరీస్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తమ జట్టులో కేవలం ఓపెనింగ్ జోడీ మాత్రమే స్థిరంగా ఉంటుందని స్పష్టం చేశాడు. మిగతా ఆటగాళ్లు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏ స్థానంలో రావడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని.. ఉంటారనీ పేర్కొన్నాడు.

**వారధి**

నిజానికి టీ20 క్రికెట్‌లో నంబర్ 3 అనేది ఫిల్లర్ పొజిషన్ కానేకాదు. ఓపెనర్లు వేసిన పునాదిని బలపరుస్తూ.. మిడిలార్డర్‌కు సహకరించేలా వన్‌డౌన్ బ్యాటర్ వారధిని నిర్మించాల్సి ఉంటుంది. పరిస్థితిని బట్టి ఒక్కోసారి పవర్‌ప్లేలోనే రావాల్సి ఉంటుంది. మరికొన్నిసార్లు బాధ్యతాయుతంగా ఆడుతూ ఇన్నింగ్స్ నిర్మించాల్సి ఉంటుంది. మిగతా వారితో పోలిస్తే వన్‌డౌన్‌లో ఆడే ఆటగాడికి ఫిక్స్‌డ్ పొజిషన్ ఉండటం అత్యంత ముఖ్యం. అందుకు తగ్గట్టుగా అతడు నైపుణ్యాలు కనబరచగలడు. కానీ టీమిండియా నాయకత్వ బృందం దీనిని ఒక ట్రయల్ రూమ్‌గా మార్చేసి ఇష్టారీతిన ప్రయోగాలు చేస్తోంది.

**సమస్యను ఫిక్స్ చేసుకోవాలి**

అయితే, ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. మన జట్టులో ప్రతిభకు కొదవలేదు. కానీ దానిని ఉపయోగించుకునే విధానంలో ?స్పష్టత లోపించింది. ఏదేమైనా వరల్డ్‌కప్ నాటికి టీమిండియా నంబర్ 3 సమస్యను ఫిక్స్ చేసుకోవాలి. అనుభవజ్ఞుడైన సూర్యను లేదంటే.. మూడో స్థానంలో ఇప్పటికే నిరూపించుకున్న తిలక్ వర్మను పంపాలి. ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీలు గెలవాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదు. అందుకు తగ్గ ప్రణాళికలు, జట్టు కూర్పులో స్పష్టత అవసరం.

# స్పోర్ట్స్

## ఎ ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా షెఫాలీ వర్మ.. ప్రపంచకప్ ఫైనల్‌లో అద్భుత ఇన్నింగ్స్‌కు దక్కిన అవార్డు..!




క్రికెట్‌లో పలు ఇన్నింగ్స్‌లు కేవలం స్కోర్‌కార్డుకే పరిమితం కాకుండా చరిత్రలో నిలిచిపోతాయి. టీమిండియా వుమెన్స్ జట్టు ఓపెనర్ షెఫాలీ వర్మ ఆడిన ప్రపంచ కప్ ఫైనల్ ఇన్నింగ్స్ సైతం అలాంటిదే. ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ 2025 టైటిల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై అద్భుత ప్రదర్శన చేసిన భారత ఓపెనర్ షెఫాలీ.. నవంబర్ మాసానికి సంబంధించి ఐసీసీ మహిళల ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికైంది. నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో.. షెఫాలీ బ్యాట్, బంతితో మ్యాచ్ స్వరూపాన్ని మార్చివేసింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. తొలి ఐసీసీ మహిళల ప్రపంచ కప్ టైటిల్‌ను అందించడంలో షెఫాలీ కీలక పాత్ర పోషించింది. టైటిల్ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ప్రారంభించిన షెఫాలీ 87 పరుగులు చేసింది. షెఫాలీ, స్మృతి మంధానతో కలిసి 104 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పి.. భారత్‌కు శుభారంభం అందించింది. ఒత్తిడిలోనూ ఈ సంయమనంతో రాణించింది. బ్యాటింగ్‌తో పాటు, షెఫాలీ బంతితో కూడా తన సత్తా చాటింది. ఏడు ఓవర్లలో 36 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి దక్షిణాఫ్రికా పటిష్టమైన బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ సునే లూస్, మరిజానే కాప్‌ను పెవిలియన్‌కు పంపింది. దాంతో ప్రొటీస్ జట్టు ఒత్తిడికి గురైంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ నమ్మకాన్ని నిలబెట్టింది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 246 పరుగులకే భారత్ ఆలౌట్ చేసింది. వాస్తవానికి వరల్డ్ కప్‌లో షెఫాలీకి చోటు దక్కలేదు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రతీక రావల్‌కు గాయం కావడంతో జట్టుతో చేరింది. సెమీ–ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై కేవలం 10 పరుగులు చేసింది. ఫైనల్‌లో మాత్రం అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నది. దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి టీమిండియా ప్రపంచకప్ టైటిల్‌ను సాధించింది. ఆ మ్యాచ్‌లో షెఫాలీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనతో ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌కు ఎంపికైంది. ఐసీసీ నుంచి అవార్డు అందుకున్న తర్వాత షెఫాలీ మాట్లాడుతూ ప్రపంచకప్‌లో తాను ఊహించినట్లుగా జరుగలేదని.. ముగింపు నేను ఆశించిన దానికంటే అందంగా ఉందని పేర్కొంది. ఫైనల్‌లో జట్టుకు నా వంతు సహకారం అందించగలిగినందుకు, సొంత ప్రేక్షకుల ఎదుట టైటిల్‌ను సాధించడంలో భాగమైనందుకు కృతజ్ఞురాలిని అని వ్యాఖ్యానించింది. ఈ అవార్డు జట్టు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు, ఈ ప్రయాణంలో తనకు మద్దతు ప్రకటించిన ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపింది. తాము జట్టుగా గెలుస్తామని, ఓడిపోతామని.. అవార్డు మాత్రం జట్టుకే చెందుతుందని తెలిపింది. షెఫాలీ వర్మ డిసెంబర్ 21న విశాఖపట్నంలో ప్రారంభమయ్యే శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో కనిపించనుంది. మహిళల ప్రీమియర్ లీగ్ (%బొూా%)లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగనున్నది. ఆ జట్టు ఓపెనర్‌ను రిటైన్ చేసుకుంది.




## ఫంకీ రిలీజ్ డేట్‌పై విశ్వక్‌సేన్ టీం క్లారిటీ..!

టాలీవుడ్‌లో ఉన్న మల్టీ టాలెంటెడ్ యాక్టర్లలో ఒకడు విశ్వక్‌సేన్ ఈ క్రేజీ యాక్టర్ హీరోగా నటిస్తున్న మూవీ 'ఫంకీ'. జాతిరత్నాలు ఫేం కేవీ అనుదీప్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో కోలీవుడ్ బ్యూటీ కయాదు లోహర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి స్పందన వస్తుంది. కామెడీ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రాన్ని ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఫంకీ చిత్రాన్ని 2026 ఫిబ్రవరి 13న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. విశ్వక్‌సేన్ కింద కూర్చుని ఉండగా..కయాదు లోహర్ అతడి తొడలు, భుజంపై డిఫరెంట్ మూడ్స్‌లో కూర్చుని కనిపిస్తుండగా.. బ్యాక్ డ్రాప్‌లో మూవీ రీల్‌ను చూడొచ్చు. ఇందులో విశ్వక్ సేన్ సినీ దర్శకుడిగా నటిస్తుండగా.. కయాదు లోహర్ నిర్మాతగా కనిపించనుంది. తాజా లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. అల్లూరి సినిమా తర్వాత కయాదు లోహర్ తెలుగులో చేస్తున్న రెండో చిత్రం కావడంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైనమెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీ సినీ ఇండస్ట్రీపై సెటైరికల్‌గా తెరకెక్కుతున్నట్టు సమాచారం.



## హైదరాబాద్‌కు అజయ్ దేవగన్ సినీ-ఎక్స్ మల్టీప్లెక్స్ తెలుగు స్టార్లకు పోటీగా బాలీవుడ్ స్టార్ అడుగు

ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – 2025 సందర్భంగా బాలీవుడ్ స్టార్‌లు సల్మాన్ ఖాన్, అజయ్ దేవగన్ భారీ పెట్టుబడులతో హైదరాబాద్ వైపు దృష్టి సారించారన్న చర్చ హాట్ టాపిక్‌గా మారింది. సల్మాన్ ఖాన్ అత్యాధునిక ఫిలిం స్టూడియో ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేస్తున్నారన్న వార్తలు వినిపించగా, అజయ్ దేవగన్ కూడా స్టూడియో నిర్మాణం కాకుండా భిన్నమైన వ్యూహంతో ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అజయ్ దేవగన్ దేశవ్యాప్తంగా 'దేవగన్ సినీ-ఎక్స్' పేరుతో మల్టీప్లెక్స్ స్క్రీన్‌లను ప్రారంభించాలనే ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశలోనే పలు నగరాల్లో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి, మొత్తం మీద సుమారు 250 స్క్రీన్‌లను వివిధ దశల్లో ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే గుర్‌గావ్‌లో 'దేవగన్ సినీ-ఎక్స్' పేరుతో ఒక థియేటర్ విజయవంతంగా నడుస్తోంది. ఇంతకుముందు అజయ్ దేవగన్-కాజోల్ దంపతులు తమ పిల్లల పేర్లపై 'ఎన్-వై సినిమాస్' పేరిట థియేటర్ వ్యాపారం నిర్వహించినప్పటికీ, ఇప్పుడు బ్రాండ్ విలువ పెంచే ఉద్దేశంతో 'దేవగన్' అనే పేరునే ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో దేవగన్ సినీ-ఎక్స్ మల్టీప్లెక్స్ ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. నగరంలోని కర్మన్‌ఘాట్ కొలీజియం మాల్‌లో ఏడు స్క్రీన్‌లతో కూడిన లగ్జరీ మల్టీప్లెక్స్‌ను వచ్చే ఏడాది ప్రారంభించనున్నారు. దీనిని దేశవ్యాప్తంగా విస్తరించాలన్నది అజయ్ దేవగన్ దీర్ఘకాల లక్ష్యంగా తెలుస్తోంది. సినిమా కెరీర్ విషయానికి వస్తే, అజయ్ దేవగన్ ఇటీవల 'సన్ ఆఫ్ సర్దార్ 2', 'దే దే ప్యార్ దే 2' చిత్రాల్లో కనిపించారు. 'దే దే ప్యార్ దే' బాక్సాఫీస్ వద్ద సంతృప్తికర ఫలితాన్ని అందుకుంది. ఇక ప్రస్తుతం 'దృశ్యం 3', 'ధమాల్ 4', 'రేంజర్' వంటి చిత్రాలు షూటింగ్ దశలో ఉండగా, ఇవన్నీ 2026లో విడుదలై ఆయన కెరీర్‌కు మరింత బూస్ట్ ఇవ్వనున్నాయనే అంచనాలు ఉన్నాయి.మరోవైపు, హైదరాబాద్‌లో ఇప్పటికే తెలుగు స్టార్‌లు మల్టీప్లెక్స్ రంగంలో దూసుకుపోతున్నారు. మహేష్ బాబు %-% ఏఎంబీ మాల్, అల్లు అర్జున్ %-% ఏఏఏ సినిమాస్, రవితేజ %-% ఏఆర్‌టీ సినిమాస్ ఇప్పటికే ప్రారంభమయ్యాయి. త్వరలో మహేష్ బాబు%-%వెంకటేష్ కాంబినేషన్‌లో 'ఏఎంబీ క్లాసిక్' కూడా ప్రారంభం కానుంది. అల్లు కుటుంబం హైదరాబాద్ అవుటర్‌లో భారీ ఫిలిం స్టూడియోతో పాటు మరో మల్టీప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో, ఇప్పుడు అజయ్ దేవగన్ కూడా మల్టీప్లెక్స్ రంగంలో అడుగుపెట్టడంతో, తెలుగు స్టార్‌లతో పోటీ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. బాలీవుడ్ స్టార్ బ్రాండ్ హైదరాబాద్ మార్కెట్‌లో ఏ స్థాయిలో సక్సెస్ సాధిస్తుందో వేచి చూడాల్సిందే.

## బాలీవుడ్‌పై కన్నేసిన 'కాంతార చాప్టర్ 1' బ్యూటీ .. ఇక హంగామా మాములుగా ఉండదు

కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు కొత్త దిశగా అడుగులు వేస్తోంది. కాంతార చాప్టర్ 1 చిత్రంలో యువరాణి కనకవతి అనే ప్రతినాయిక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన రుక్మిణి, తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా హిట్ ఇచ్చిన ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తున్నట్లు వెల్లడించింది.తెలుగు, కన్నడ చిత్రసీమలకు ఇప్పటికే పరిచయమైన ఈ బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో తమిళ చిత్రాల్లోనూ క్రేజీ ఆఫర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్‌పై తన ఆసక్తిని బహిరంగంగానే వ్యక్తం చేసిన రుక్మిణి, హిందీ భాషతో తనకున్న అనుబంధమే అక్కడ నటించాలనే తపనకు కారణమని చెప్పింది. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "హిందీ నాకు చిన్నప్పటి నుంచే పరిచయం ఉన్న భాష. మా కుటుంబానికి సైనిక నేపథ్యం ఉండటంతో, వివిధ కంటోన్మెంట్ల మధ్య అనుసంధాన భాషగా హిందీ ఉండేది. అందుకే ఆ భాషపై నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటివరకు హిందీలో నటించే అవకాశం రాలేదు. కానీ, ఆ భాషలో నా ప్రతిభను నిరూపించుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నాను. దేవుడి దయతో త్వరలోనే ఆ ప్రయాణం ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాను" అని తెలిపింది.రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన కాంతార చాప్టర్ 1 విడుదలై సంచలన విజయం సాధించగా, ఇందులో రుక్మిణి వసంత్ ప్రతినాయిక పాత్రలో కనిపించి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఆమె అందచందాలు, నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ప్రస్తుతం ఈ సినిమా విజయం ఇచ్చిన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నానని చెప్పిన రుక్మిణి, త్వరలో కాంతార టీమ్ అంతా కలిసి విజయోత్సవాన్ని జరుపుకుంటామని వెల్లడించింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జార?ండ్ సహా దేశం నలుమూలల నుంచి వస్తున్న స్పందనలు తనను ఎంతో ఉత్సాహపరుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బాలీవుడ్ ఎంట్రీతో పాటు దక్షిణాది భాషల్లోనూ రుక్మిణి వసంత్ కెరీర్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## ఓన్లీ పర్‌ఫార్మెన్స్.. రూటు మార్చేసిన రవితేజ హీరోయిన్



మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఆంధ్ర కింగ్ తాలూకా, కాంతా సినిమాలలో కూడా మెరిసింది. కెరీర్లో అతితక్కువ సమయంలోనే క్రేజీ ఆఫర్ కొట్టేసింది. తాజా టాక్ ప్రకారం భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ సెంట్రిక్ సినిమాను లైన్లో పెట్టిందట. అంతేకాదు వన్ ఆఫ్ ది లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ స్వప్నాదత్, ప్రియాంకా దత్ స్వప్నా సినిమా బ్యానర్‌పై ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్నారు. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటుంది ఈ బ్యానర్. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్నాడు. పవర్ ఫుల్ ఉమెన్ సెంట్రిక్ సబ్జెక్టుతో స్క్రిప్ట్ రెడీ చేశాడట రమేశ్. ఇప్పటిదాకా గ్లామరస్ రోల్స్ లో మెరిసిన భాగ్యశ్రీని ఇక నటనకు ఆస్కారమున్న పాత్రలో చూపించబోతున్నాడట డైరెక్టర్. మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్‌కు చెందిన ఈ భామ హిందీ ప్రాజెక్టులు యారియాన్, చందూ చాంపియన్‌లో కామియో రోల్స్ లో నటించింది. మిస్టర్ బచ్చన్ సినిమాకు గాను బెస్ట్ ఫీ మేల్ డెబ్యూ ఫర్ తెలుగు అవార్డు అందుకుంది. మరి తాజాగా చేస్తున్న లేడీ ఓరియెంటెడ్ సినిమా భాగ్యశ్రీలోని నయా యాంగిల్‌ను చూపించడం ఖాయమైనట్టేనని ఈ వార్త క్లారిటీ ఇచ్చేస్తుది. మరి భాగ్యశ్రీ ఎలాంటి కథాంశంతో ప్రేక్షకుల ముందుకొస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



## ఫ్యాన్స్ గెట్ రెడీ.. సూర్య 46 షూట్‌పై నయా అప్‌డేట్ ఇదే..!

కోలీవుడ్ యాక్టర్ సూర్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో చేస్తున్న సూర్య 46 (%ాబతీఱఙ% 46). ఈ చిత్రంలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. సీనియర్ నటి రవీనా టాండన్ కీలక పాత్ర పోషిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. ఫైనల్‌గా సూర్య 46 షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయనని టాలీవుడ్ సర్కిల్ సమాచారం. ఇంకేంటి మరి త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై క్లారిటీ వచ్చే అవకాశాలున్నట్టు కూడా తాజా అప్డేట్ హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com